# స్వతంత్ర భారతం - దళితులు

...✍ వి. నందగోపాల్

స్వతంత్ర భారతదేశానికి అరవై ఏండ్లు. ప్రాచీన భారతదేశానికి ఆరువేల ఏండ్లు. ఆటవిక ఆదిమ సమాజం నుండి మనం ఆధునిక సమాజానికి చేరుకొన్నాం. సమాజం ఎప్పుడూ ఆగదు. ముమ్మందుకు సాగిపోతూనే వుంటుంది. నిరంతరం అభివృద్ధి చెందాలనే తపన. అందుకు ఎన్నో ప్రణాళికలు, పథకాలు, పంథాలు ప్రయత్నాలు చేస్తూనే వుంటుంది. ఆ క్రమంలో స్వతంత్ర భారతదేశం 60 సం॥రాలలో సాధించిన ప్రగతి ప్రశంసనీయం. అయితే మనం చింతించవలసిన విషయం ఈ సమాజం తనలోని కొన్ని సమూహాలను ప్రగతి పథం నుండి నెట్టివేసి, అసలు మీరు మనుషులే కాదు అని అంటరాని వారుగా వెలివేసి, అంతటితో ఆగక ఎలా బ్రతకాలో శాసించి, ఏం చేయాలో నియంత్రించి ఈ క్రమంలో వారిని తరాల బానిసత్వానికి, పరాధీనతకు, గురిచేసింది. నిరక్షరాస్యత, నిరుద్యోగం, అసమానత, అంటరానితనం, అవమానం, అంతులేని పేదరికం, ఇవీ ఈ సమాజం తన ప్రగతిపథంలో దళితులకిచ్చిన ఆస్తులు. ఇది సమాజం ఈ వర్గాలకు చేసిన తీరని ద్రోహం. ఈ క్రమంలో చోటుచేసుకొన్న వివక్ష, మానవత్వానికి సిగ్గుచేటు. అనేక వందల, వేల సంవత్సరాలుగా తమను ఇలాంటి దుస్థితికి గురిచేసిన ఈ సమాజం పై ఎంతటి కసి, ద్వేషము వుంటుందో ఊహించవచ్చు. అయితే 'మా పోరాటం సంపద కోసమో, లేక అధికారం కోసమో కాదు, మా పోరాటం ఆత్మగౌరవం కోసం, సాటి మనుషులుగా గుర్తించే మానవత్వపు విలువలను పెంపొందించడం కోసం అనే నినాదంతో పోరాటం చేస్తున్న దళిత వర్గాల మానవత్వ విలువల పోరాటం సర్వదా ప్రశంసనీయం. 60 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో ఎన్నో ప్రభుత్వాలు వస్తూనే వున్నాయ్. పోతూనే వున్నాయ్, మరి దళితుల జీవితాలలో అభివృద్ధి అందని చందమామగానే ఎందుకు మిగిలిపోతూ ఉంది. అడుగడుగునా వారిని వివక్షతతో ఎందుకు వంచిస్తూ వున్నాయి.

తరాల భారతదేశ చరిత్రలో, దళిత, నిమ్న వర్గాలకు జరిగిన అన్యాయాలను, అసమానతలను గుర్తించారు కాబట్టి, నిమ్నజాతుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలే తన జీవిత పరమావధిగా చేపట్టిన మహా మేధావి డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆధ్వర్యంలోని రాజ్యాంగ రచనా కమిటి షెడ్యూలు కులాలను, షెడ్యూల్ తెగలను ఈ సమాజపు అనాదరణకు అసమానతలకు వివక్షలకు గురైన సమూహాలుగా గుర్తించింది. వారి అభివృద్ధికి, అభ్యుదయానికి సమానత్వానికి మానవత్వానికి రాజ్యాంగంలో ఎన్నో అధికరణాలను పొందుపరచి చట్టాలు అందించింది. హక్కులను ప్రకటించింది. రక్షణకు మార్గాలను ఏర్పరిచింది. మరి ఇవన్నీ ఎందుకు దళితుల దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. అలా వచ్చుంటేమరి ఈ రోజు ప్రతి అభివృద్ధి సూచిక లోనూ దళితులు ఎందుకు చివరన ఉన్నారు.

ఉదాహరణకు మన రాష్ట్రంలో 2000 సం॥రంలో నాటికి రాష్ట్ర జనాభాలో దళితులు 16శాతంగా ఉన్నారు. నిరుపేద కుటుంబాలు వారిలో 50.41 ఇతర కులాల్లో ఇది 32 శాతం. 75% పైగా దళిత కుటుంబాల ప్రధాన జీవనోపాధి వ్యవసాయ కూలి. రోజుకీ వాళ్ళు పొందే కూలి 30-40 రూపాయిలకు మించిలేదు. గ్రామీణ ప్రాంతంలో ఇతర కులాల వారు సగటున నెలకు వెచ్చిస్తున్న కుటుంబం ఖర్చు రూ. 685.31 కాగా దళిత కుటుంబం వెచ్చిస్తున్న ఖర్చు రూ. 474.72. 1990 లెక్కల ప్రకారం వ్యవసాయం, వ్యవసాయేతర వ్యాపారాలలో ఇతర కులాల వారి యాజమాన్యం 88.3 శాతంగా వుండగా దళితులలో అది 6.3 శాతం మాత్రమే.

దారిద్ర్యరేఖకు దిగువన వున్న ఇతర కులాల శాతం 26.63% కాగా దళితుల శాతం 43%. అన్నింటికంటే కలవరపెట్టే అంశం దళిత విద్యార్థుల డ్రాప్ అవుట్ రేటు.

**1-5 తరగతుల మధ్య బడి మానివేస్తున్న దళిత బాలలు - 48%**

**1-5 తరగతుల మధ్య బడి మానివేస్తున్న దళిత బాలికలు - 46.1%**

**6-8 తరగతుల మధ్య బడి మానివేస్తున్న దళిత బాలురు - 63.4%**

**6-8 తరగతుల మధ్య బడి విరమించుకున్న దళిత బాలికలు - 68.87%**

ఇక ఆపై ఉన్నత చదువులకు వెళ్ళగలిగిన వారు ఎంత మంది? వెళ్ళ కలిగినా కార్పోరేట్ చదువుల విలువల వెలలతో పోటీ పడగలిగే వారెందరు?

అయినా సరే తమ జీవితంలో మార్పు తీసుకొనివచ్చే రోజు తప్పక వస్తుందని మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్న దళితుల జీవితాలలో చిత్తశుద్ధితో అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నట్లైతే ఈ ప్రభుత్వాలు సాధారణ ప్రణాళికలు, పథకాల కంటే భిన్నమైన ప్రణాళికలు, పథకాలు తీసుకొని రావాలి. వాటిని అమలుపరిచే అధికారులు, ఈ సమాజం సృష్టించిన సాంఘిక ఆర్థిక రాజకీయ అసమానతలు, వివక్షల నేపథ్యం నుండి ఎదుగుతున్న దళితులు తమ అడ్డంకులను అధిగమించి ఈ ఫలితాలు పూర్తిగా అందుకోవడానికి అనువైన విధంగా వాటిని అమలుపరచాలి. చట్టాలను అమలుచేసే అధికారులైనా, వాటి హక్కులను కాపాడే న్యాయస్థానాలైనా, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేసే యాంత్రాంగాలైనా, తమ ఆలోచనల్లో దళిత దృక్పథాన్ని పెంపొందించుకోగలిగితే సాధించే ఫలితాలు ప్రశంసాత్మకంగా వుంటాయి.

ఈ దళిత దృక్పథాన్ని పెంపొందించి విస్తరింపచేసే బాధ్యత ఎవరికి వారు తమ తమ పరిధిలో వున్న అవకాశాలను వినియోగించు కొని ఈ దృక్పథాన్ని విస్తరింపజేయ కలిగితే మార్పును మరింత వేగవంతం చేయగలం.

## దళిత్ కాల్ లైన్

### నెంబర్ : 040 - 65440969

నేటి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాక్షి మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించుకుంటూ ముందుకు వెళుతుంది. ఆ క్రమంలో ఉన్న సమాచార వ్యవస్థని మరింత విస్తృతం చేసుకోవాల్సిన అవసరం వుంది.

కావున గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన **"రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్‌మరణాలు** మొదలైన వాటి వివరాల ఫోన్ నెంబర్ 040-65440969 లను తెలియజేయవలసిందిగా కోరడమైనది.

ఇట్లు

**సాక్షి మానవహక్కుల నిఘా**

# ఆరు దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో దళిత స్త్రీల స్థితిగతులు

...✍ డా. ఇ. సుధారాణి

భారతదేశం కేవలం రెండు శతాబ్దాల కాలం పరాయిపాలన క్రింద మగ్గితే, భారతదేశంలోని దళితులు కొన్ని వందల ఏళ్ళ పీడనకు అణచివేతకు గురైనారు. భారతీయ జనాభాలో ఐదోవంతు ఉన్న దళితుల అణచివేత ఆర్యుల రాకతో మొదలై, ధర్మశాస్త్రాలు, స్మృతులు (మనుస్మృతి, పరాశర స్మృతి, నారద స్మృతి) వంటి వాటివల్ల విద్య నుండి సమాజం నుండి దూరంగా నెట్టివేయబడ్డారు. మొట్ట మొదట దళితుల పక్షాన నిలబడి అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాడింది. బౌద్ధం. తర్వాతికాలంలో వీరశైవం. ఆధునిక కాలంలో బ్రిటీష్‌పాలనలో దళితుల స్థితిగతుల్లో మౌలిక మార్పులేదు. ఆంగ్లేయులు బ్రాహ్మణవర్గపు కొమ్ముగాస్తూ దళితుల అభ్యున్నతిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. కాని 19వ శతాబ్దపు సంస్కరణోద్యమ బ్రాహ్మణత్వ దోపిడీ గుట్టు విప్పి దళితుల వికాసం కోసం పాటుపడిన సంస్కర్త జ్యోతిరావుపూలే. జ్యోతిరావు పూలే చేసిన ఉద్యమస్ఫూర్తితో బాబాసాహెబ్ దళితుల విముక్తి మార్గం వైపు పోరాటం చేసాడు.

దళిత పురుషులతో బాటు కుల, వర్గపరమైన అసమానతల్ని పంచుకొన్న దళిత స్త్రీ పురుషుని కన్నా ఎక్కువ అణచివేతను లైంగిక అత్యాచారాల్ని ఎదుర్కొంటున్నది.

సంఖ్యాపరంగా చూస్తే దళిత స్త్రీలు దళిత జనాభాలో 49.96 శాతం ఉన్నారు. మొత్తం స్త్రీల జనాభాలో వీరు 16.3 శాతం ఉన్నారు. 81.45 శాతం దళిత స్త్రీలు గ్రామాల్లో, 12శాతం పట్టణాల్లో నివసిస్తున్నారు. ఇంత పెద్ద జనాభాగా ఉన్న దళిత స్త్రీల పరిస్థితి అక్షరాస్యత విద్య, ఆరోగ్యం వృత్తి, వేతనాల్లో ఎలా ఉంది అనే విషయాన్ని పరిశీలిద్దాం.

భారతదేశం స్వాతంత్ర్యదేశమైన తర్వాత భారత రాజ్యాంగ రచన గావించబడింది. రాజ్యాంగం సమానత్వాన్ని, సమాన అవకాశాల్ని ప్రబోధించింది. తర్వాతి కాలంలో భారతదేశంలో అధికారంలో ఉన్న అన్ని ప్రభుత్వాలు దళితుల సంక్షేమం కోసం ప్రణాళికలు, పథకాల ద్వారా ప్రయత్నాలు చేసాయి. ముఖ్యంగా ఆరవ పంచవర్ష ప్రణాళిక కాలం నుండి అణగారిన వర్గాలు, ఆ వర్గాలలోని స్త్రీల విద్య, ఆరోగ్యం ప్రత్యేక పథకాలు రూపొందించబడ్డాయి.స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ ద్వారా బడ్జెట్‌ను జనాభాపరంగా దళితుల అభివృద్ధి కోసం కేటాయించడం మొదలైంది. ఈ అరవై ఏళ్ళ కాలంగా అభివృద్ధి పథకాలన్నీ నిస్సార్థంగా, ఖచ్చితంగా ఎందుకు అమలుపర్చలేదో అనే ప్రశ్న మన ముందుకి వస్తుంది. ఎందుకంటే విద్య, ఆరోగ్యం వేతనం, ఉపాధి, సాధికారత విషయాల్లోను దళితులపై జరిగే దాడులు, అత్యాచారాల నేపథ్యాన్ని పరిశీలిస్తే, దళితులు ముఖ్యంగా దళిత స్త్రీలస్థితిగతుల్లో మార్పు మనకు అర్థమౌతుంది.

**జనాభా నిష్పత్తి :**

జనాభా నిష్పత్తిలోనే మొట్టమొదటి అసమానతలు కన్పిస్తాయి. సగటు స్త్రీల నిష్పత్తి 1951లో 946 ఉంటే, 1991 లో ఇది 927 గా ఉంది. దళితుల్లో ఈ నిష్పత్తి 1961లో 957 ఉంటే 1991లో 922కు పడిపోయింది. జనాభాలో వ్యత్యాసం దళిత స్త్రీల పేదరికం, అనారోగ్యానికి అద్దం పడుతుంది.

**విద్య :** నిరక్షరాస్యతా నిర్మూలనా కోసం ప్రభుత్వం ఎన్ని పథకాలు చేసినా, అక్షరాస్యతలో దళితులు ముఖ్యంగా దళిత స్త్రీలు అట్టడుగు స్థాయిలోనే ఉన్నారు. ఆర్థిక సంస్కరణలలో భాగంగా వచ్చిన గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్‌ల ప్రభావంగా విద్యను ప్రైవేటీకరించటం, క్రమేపి ప్రభుత్వం సంక్షేమ బాధ్యత నుండి తప్పుకోవటం జరిగి అనేకమంది పేదలైన దళితులు ప్రత్యక్షంగా విద్యకు ఇంకా దూరంగానే ఉంటున్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చి ప్రకారం, ప్రైవేట్ ప్రాథమిక విద్య ప్రభుత్వ విద్య కన్నా 230 రెట్లు వ్యయభరితమైందని తేలింది. పేదరికంలో మగ్గే దళితులు పిల్లల చదువుల విషయానికొస్తే, బాలికల్ని బడి మాన్పించే పరిస్థితి దీని మూలంగా ఏర్పడుతున్నది. దళితుల, స్త్రీల అక్షరాస్యత రేటును పరిశీలిస్తే ఎన్నో వాస్తవాలు మనల్ని కలవరపెడ్తాయి.

**ఎస్.సి. మహిళల అక్షరాస్యతా శాతం**

| సం॥ | మొత్తం అక్షరాస్యత | మొత్తం మహిళలు | ఎస్.సి. మహిళలు | ఎస్.సి. పురుషులు |
|---|---|---|---|---|
| 1961 | 24.02 | 12.95 | 3.29 | 16.96 |
| 1971 | 29.46 | 18.72 | 6.44 | 22.36 |
| 1981 | 43.67 | 29.85 | 10.93 | 31.12 |
| 1991 | 52.21 | 39.29 | 23.76 | 49.91 |

**1961 - 1991 జనాభా నివేదిక**

ప్రాథమిక స్థాయి నుండి మాధ్యమిక స్థాయి. ఆ పైన సెకండరీ స్థాయిలో బడిమానేసే విద్యార్థుల్లో దళితులు ఎక్కువసంఖ్యలో ఉన్నారు. బాలికల శాతం మరింత ఎక్కువగా ఉందని ఎస్.సి, ఎస్.టి కమీషన్ పేర్కొంది. సెకండరీ స్థాయిలో దాదాపు 83శాతం దళితఆడపిల్లలు బడిమానేస్తున్నారు. ఇంత ఎక్కువగా ఉన్న ఈ డ్రాపౌట్ రేట్స్‌ను అరికట్టడానికి ఇంతవరకు ఒక సమగ్ర ప్రణాళిక లేకపోవడం శోచనీయం.

ఉన్నతవిద్యలో కూడా దళితుల శాతం చాలా తక్కువగా ఉంది. దళిత పురుషులశాతం 7.77 అయితే, స్త్రీల శాతం కేవలం 3.78శాతంగా ఉంది. ఉన్నత విద్యకై భారీగా సబ్సిడీల కోత, ప్రైవేటైజేషన్‌ల మూలంగా ఉన్నతవిద్య దళితులకింకా అందని ద్రాక్షే అవుతున్నది.

సాంఘిక సంక్షేమ హాస్టల్లు విరివిగా స్థాపించినా, వాటి అమలు తీరు అసంతృప్తికరంగా ఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు

70 సాంఘిక సంక్షేమ హాస్టల్లున్నాయి. కొన్ని ప్రత్యేక బాలికల వసతి గృహాలు ఉన్నాయి కానీ ఈ వసతి గృహాల్లో బాలికల రక్షణకు సంబంధించిన అనేక వార్తల్ని రోజూ చూస్తున్నాం. వసతుల లేమికి తోడు రక్షణలేకపోవటం వల్ల ఆడపిల్లలు హాస్టల్లు వదిలే పరిస్థితే చాలా తరచుగా వస్తున్నది.

**ఆరోగ్యం** : దళితుల్లో అత్యధికులు పేదరికంలో ఉండడం వల్ల పౌష్టికాహార లోపం, అనారోగ్య ప్రభావం దళిత స్త్రీలపై ఎక్కువగాఉంది. దీనికి తోడు బాల్యవివాహాల కొనసాగింపు, మూఢనమ్మకాలు, నిరక్షరాస్యతల వల్ల మరింత జటిల సమస్యలను వీరు ఎదుర్కొంటున్నారు. దళితుల్లో శిశుమరణాల శాతం మిగతావారి కన్నా ఎక్కువ. దాదాపు 83శాతం మంది పిల్లలు 1 సం॥రం లోపే మరణిస్తున్నారు. శిశుమరణాలు ప్రతి 1000 జననాలకు 95 ఉంటున్నాయి. బాలింత మరణాలుకూడా దళిత స్త్రీలలో ఎక్కువే. దళిత స్త్రీలలో 72 శాతం ప్రసవాలు ఇపుడు ఇళ్ళల్లోఅనుభవం లేని దాయిల పర్యవేక్షణలో జరుగుతున్నాయని నేషనల్ ఫామిలీ హెల్త్ సర్వే (1998-99) వెల్లడించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నా సిబ్బంది కొరత, ఆసుపత్రుల నిర్లక్ష్యవైఖరి, గ్రామాల్లోఇప్పటికే కొనసాగుతున్న అంటరానితనం లాంటి ఇతర కారణాల వల్ల కూడా అందరికీ ఆరోగ్యం అన్నది ఇప్పటికీ వాస్తవరూపం దాల్చటం లేదు.

**ఉపాధి :** 70శాతం దళిత కుటుంబాలు స్త్రీల పైనే ఆధారపడి ఉంటున్నాయి. 85శాతం దళిత స్త్రీలు వ్యవసాయాధారిత పనుల్లో ఉన్నారు. 71.9 శాతం వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. అత్యధిక శాతం అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నారు. కనీసవేతనాలు, అందనిపనుల్లో చాలామంది బ్రతుకులీడుస్తున్న వ్యవసాయ కూలీలకు, రాళ్ళు కొట్టే స్త్రీలకు, నేత కార్మికులకు భవన నిర్మాణంలో బీడీ ఫ్యాక్టరీలలో పారిశుధ్య కార్మికురాలిగా మరెన్నో చోట్ల నిరంతరం శ్రమ దోపిడీకి వివక్షకు గురౌతున్నది. కాంట్రాక్టు లేబర్ చట్టాలు అన్నిచోట్ల అమలుపరచటం లేదు. స్త్రీ, పురుషులకు సమానవేతన చట్టంవచ్చి 30ఏళ్ళు దాటినా ఇంకా అమలుపర్చబడట్లేదు. వనరుల విషయానికొస్తే సహజవనరుల పరిరక్షణలో దళితుల భాగస్వామ్యం ఉన్నా, వనరులపై అధికారం మాత్రం లేదు. దాదాపు 74శాతం దళితులకు కనీసం ఒక ఎకరా భూమి కూడాలేదు. భూ పంపిణీ సమగ్రంగా అమలుపర్చటం లేదు. స్వాతంత్ర్యం సిద్ధించి అరవై ఏళ్ళు అయినా ఇంకా దళితులు భూమిపై ఆధిపత్యానికి నోచుకోలేదు.

## దళిత స్త్రీలపై అత్యాచారాలు :

దళితులపై దాడులు, అత్యాచారాలు మానవత్వానికి మచ్చగా ఇంకాకొనసాగుతున్నాయి. భూమికై, భుక్తికై, నేలకై, ఆత్మగౌరవానికై దళితులు పోరాడినప్పుడల్లా వారిపై దాడులకు, వారి స్త్రీలపై లైంగిక దాడులకు అగ్రకులాలు పాల్పడుతున్నారు. దళిత స్త్రీలపై లైంగిక దాడి ద్వారా దళితులను నైతికంగా దెబ్బతీయడం అనే అగ్రకులాల కుట్ర ఉంది. బీహార్‌లో భూస్వాములని వేతనాలడిగితే రణబీర్ సేన వందలాది మందిని కాల్చి చంపి దళిత స్త్రీలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడింది. రాజస్థాన్‌లో బన్వారీదేవి ఒక బాల్యవివాహాన్ని అడ్డుకొంటే ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాత బన్వారీ దేవి కోర్టును ఆశ్రయిస్తే,అగ్రవర్ణ పురుషులు అంటరాని స్త్రీలపై అత్యాచారం చేయడమనేది నమ్మశక్యం కాకుండా ఉందని న్యాయస్థానం పేర్కొనటం విచారకరం. కారంచేడులో దుడ్డుసువార్తమ్మ ఆత్మగౌరవ ప్రశ్నతో మొదలైన మారణకాండలో అనేకమంది దళితుల్ని చంపడమే కాక దళిత స్త్రీలను కూడా చెరిచారు. నిన్నటి ఖైర్లాంజిలో సురేఖ, ప్రియాంకల రేప్‌కూడా దీనికి మరో ఉదాహరణ. ఇప్పటికి కూడా ఎన్ని చట్టాలు ఉన్నా దళిత స్త్రీలపై అత్యాచారాలు యధేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. 2000 సం॥రంలో నేషనల్ క్రైం రికార్డ్సు బ్యూరో ప్రకారం 25455 నేరాలు దళితులపై జరిగాయి. ఈ రిపోర్టు ప్రకారం ప్రతిరోజు ముగ్గురు దళిత స్త్రీలు మానభంగానికి గురౌతున్నారనిపేర్కొంది. అత్యాచార నిరోధక చట్టం క్రింద నమోదైన దళిత స్త్రీలపై జరిగిన మానభంగపు కేసులు ఒక్క 2000 సం॥లోనే 1034. కానీ చాలా కేసులు రిపోర్టు చేయబడటం లేదు. రిపోర్ట్ చేసిన కేసుల్లోనూ, బాధితులకు పూర్తి న్యాయం జరగటం లేదు. అనేక కేసులు పూర్తవకుండానే విత్‌డ్రా చేసుకుంటున్నారు.

దళిత స్త్రీలపై మతం పేరిట జరిగే మరో దురాచారం మాతంగి జోగిని వ్యవస్థ మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల్లో మురళి, బసివి, జోగిని, నాతిలనే పేరిట దళిత బాలికలను బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టివేసే దురాచారం నేటికీ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు 18వేల మంది జోగినీలున్నారన్నది ఏ అభివృద్ధికి సంకేతం.

## రాజకీయ భాగస్వామ్యం

స్వతంత్ర భారతంలో దళితులకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించబడితే స్వాతంత్ర్య వచ్చిన 35 ఏళ్ళకు 73వ రాజ్యాంగ అధికరణం ద్వారా పంచాయితీ వ్యవస్థల్లో స్త్రీలకు 1/3వంతు సీట్లు కేటాయించబడ్డాయి. వీటిలో జనాభా ప్రకారం దళిత స్త్రీలకూ రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. కానీ, 25 ఏళ్ళరిజర్వేషన్ తర్వాత కూడా దళిత మహిళా ప్రజాప్రతినిధులకు పూర్తిఅధికారాలు కానీ, అధికారాల్ని సద్వినియోగం చేసుకొనే పరిస్థితులు కానీ గ్రామాల్లో కనిపించవు. సంఖ్యాపరంగా వీరి ప్రతినిధులు పెరిగినా గుణాత్మకంగా వీరి అధికార వినియోగం జరగటం లేదు. ఇక్కడ కూడా అ విద్య, భూములు, అగ్రకుల అధికారం, దళిత పురుషుల వివక్షలన్నీ కలిపి దళిత ప్రజాప్రతినిధులకు ప్రతిబంధకంగా మారాయి.

పైన పేర్కొన్న అంశాలే కాక, ఆహారభద్రత కనీస గృహవసతులు, కనీస సౌకర్యాలు, రక్షిత త్రాగునీరు మరెన్నో విషయాల్లో అసమానతలు మనకు కన్పిస్తాయి.

అనేక అవమానాలు వివక్షలు, అత్యాచారాల నేపథ్యంలో జన్మించిన దళితుల ఆత్మగౌరవ పోరాటాల్లో దళిత స్త్రీలు సమానంగా పాలు పంచుకున్నారు. అనేకమంది విద్యావంతులు, ప్రజాసంఘాలు పూలే, అంబేడ్కర్ భావజాలం దృష్ట్యా ప్రజాసమస్యల్ని వెలుగులోకి తెస్తున్నారు. దళిత ఉద్యమాల్లోనూ, స్త్రీవాద ఉద్యమాల్లోను దళిత

*(➡ తరువాయి 6వ పేజిలో ..... )*

# 60 సంవత్సరాల అభివృద్ధిలో దళితులు - గిరిజనులు

...✍ - సారంపల్లి

**2007** ఆగస్టు 15తో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 60 సంవత్సరాలు పూర్తిచేసుకొంటున్నది. ఈ 60 సంవత్సరాల్లో దేశం అభివృద్ధి చెందినమాట వాస్తవమే. అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగి, వాటి ఫలాలు అందరికీ అందుబాటులోకి రావాలి. అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా వెనుకబడిన దళిత,గిరిజన, బడుగు వర్గాల అభివృద్ధి, మిగిలిన వర్గాల అభివృద్ధి కన్నా అదనంగా జరగాలి. ఆదాయాల్లో తేడాను తగ్గించాలి. తిండి, ఇండ్లు, ఉపాధి, ఆరోగ్యం, విద్య రంగాలు అందరికీ అందుబాటులో వుండాలి. 60 సంవత్సరాల గడచిన చరిత్రను అవలోకనం చేసుకొన్నప్పుడు దళితులు, గిరిజనులు ఏ మేరకు అభివృద్ధి చెందారు! పై వర్గాల అభివృద్ధితో పోల్చినప్పుడు ఈ వర్గాల అభివృద్ధి ఏ మేరకు జరిగింది? కనీసం దామాషా ప్రాతిపదికన అభివృద్ధి జరిగిందా? అన్నది పరిశీలించాలి. 1947 ఆగస్టులో కన్నా విద్యారంగం, యితర ఉపాధి రంగాల్లో అభివృద్ధి శాతం బడుగువర్గాల్లో ఏ మేరకు జరిగిందన్నది శల్యపరీక్ష చేసుకోవాలి. 2004 మే శాసనసభ ఎన్నికలకు ముందు నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రణాళిక ఈ విధంగా చెప్పింది.

" దళితుల సంక్షేమం కోసం కట్టుబడిన స్వచ్ఛంద సంస్థలకు అంటరానితనం ఎక్కువగా వున్న గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం కల్గించే బాధ్యతను అప్పగించారు. షెడ్యూల్డ్ తరగతుల వారికి ఆలయప్రవేశం లేనిచోట ఉద్యమాలు నిర్వహించడానికి రాజకీయ నాయకులు, సాంఘిక కార్యకర్తలు కృషి చేయాలి. ఈ విషయంలో కాంగ్రెస్ తగిన చర్యలు తీసుకొంటుంది. దళిత విద్యార్థులు చదువుకునేటప్పుడు జీవనోపాధి సంపాదించుకోవడానికి వీలుగా పాఠశాలల్లో వృత్తిశిక్షణా కోర్సులు ప్రారంభిస్తాం. అలాగే, రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కూడా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం వృత్తివిద్యా కోర్సులు ప్రారంభిస్తాం. ఎస్సీ, ఎస్టీలలో యితర బలహీన వర్గాల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను కొంత మొత్తం కన్నా తక్కువ విలువగల కాంట్రాక్టులన్నీ ఈ వర్గాలవారికే కేటాయించడానికి కొంత మొత్తానికి లోబడి ప్రభుత్వ విభాగాలు సేకరించే పదార్థాల సేకరణ బాధ్యతను కూడా ఈ వర్గాలకే కేటాయిస్తాం.

ప్రయివేటు రంగంలో షెడ్యూల్డు కులాల, తెగలవారికి రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్నెళ్ళలోగా 40వేల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాలు, 70వేల బి.సి, బలహీనవర్గాల ఉద్యోగాలు భర్తీ చేయడానికి కృషి చేస్తుంది." ఈ ప్రణాళిక ఎంతమేర అమలు జరిగింది? మే 2007 నాటికి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 సంవత్సరాలు పూర్తయి నాల్గవ సంవత్సరం కొనసాగిస్తున్నది. మరో సంవత్సరంలో ఎన్నికలు రాబోతున్నాయి. మరలా ఎన్నికల ముందు దళితులను అభివృద్ధి చేస్తామంటూ, ఎన్నికల ప్రణాళికా రచన సాగుతుంది. కాని గతంలో యిచ్చిన హామీలు ఏ మేరకు అమలు జరిగాయన్న సమీక్ష మాత్రం జరగదు. గత కాలపు సమీక్షలు జరపకుండానే అభివృద్ధికి ప్రణాళికలు వేయడం మన ప్రజాస్వామ్య దేశంలో పాలకులు ఆనవాయితీగా సాగిస్తున్న విధానం. ఆయా వర్గాలు చైతన్యం పొంది ఉద్యమించిన సందర్భాల్లో ఒకటో, అరో కోర్కెలను సాధించుకోవడం పరిపాటి అయింది.

**జనాభా పెరుగుదల (లక్షలలో)**

| | | | | 2001 |
|---|---|---|---|---|
| వర్గం | 1961 | 2001 | గ్రామీణ | పట్టణ |
| దళితులు | 49.74 | 123.40 | 102.20 | 21.20 |
| జనాభాలోశాతం | 13.8 | 16.19 | (దళితులలో) | 17.18 |
| గిరిజనులు | 13.24 | 50.28 | 46.47 | 3.77 |
| జనాభాలో శాతం | 3.7 | 6.6 | (గిరిజనులలో) | 5.51 |
| వ్యవసాయ కార్మికులు | 128.23 | 216.92 | - | - |

**విద్య (2001 సంవత్సరం లెక్కలప్రకారం)**

| | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| దళితులు | 33.40 | 22.80 | 56.20 |
| దళితులలో శాతం | 63.51 | 43.35 | 53.52 |
| గిరిజనులు | 10.10 | 5.35 | 15.45 |
| గిరిజనులలో శాతం | 47.66 | 26.11 | 37.04 |

పై గణాంకాలను పరిశీలించినప్పుడు జనాభా పెరుగుదలలో 1961 నుండి 3.11శాతం దళితులు పెరిగారు. అలాగే గిరిజనులు 2.9 శాతం పెరిగారు. ఆర్థికంగా, సాంఘికంగా మరియు రాజకీయంగా పెరుగుదలను చూసినప్పుడు 1961 కన్నా వృద్ధిరేటు తగ్గింది.

రాష్ట్రంలో ప్రస్తుతం 2356 హాస్టళ్ళు (బాలురకు 1691, బాలికలకు 665) మాత్రమే వున్నాయి. యిదులో 2.50 లక్షల విద్యార్థులు వున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీరికిస్తున్న హాస్టల్ ఛార్జీలు కనీస అవసరాలకు కూడా సరిపోవు. 7వ తరగతివరకు చదివే విద్యార్థికి నెలకు రు. 338 మరియు 8-10 తరగతుల మధ్య చదివే విద్యార్థికి రు. 412లుగా నిర్ణయించారు. బాలురుకు రు. 20లు, బాలికలకు రు. 25లు ప్రతినెల కాస్మొటిక్ ఛార్జీలుగా యిస్తారు. యివి ఏమూలకు? హాస్టల్స్‌లో కనీస వసతులు కూడా వుండవు. పై కప్పులు సరిగాలేని వసతి భవనాలు, అస్తవ్యస్తంగా వున్న మూత్రశాలలు, నీరు సరిగా రాని పంపులు, వైద్య సౌకర్యాల్లేమితో గజ్జి, తామరల్లాంటి వ్యాధులతో సతమతమవుతున్న బాలబాలికలు దర్శనమిస్తారు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యిస్తున్న ఉపకార వేతనాలు కూడా అంతంత మాత్రమే. ప్రొఫెషనల్స్‌కు నెలకు రు.740లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లకు నెలకు రు. 525లు, డిగ్రీ చదువుతున్న

విద్యార్థులకు రు. 400లు మాత్రమే యిస్తున్నారు. యిదీ దళిత, గిరిజనుల విద్యాభివృద్ధికి సాగిస్తున్న తీరు!

## భూ సమస్య

2005-06లో దళితులు 14.22 లక్షల కమతాలు కల్గివుండగా వారివద్ద 28.07 లక్షల ఎకరాలు మాత్రమే వుంది. ఈ కమతాలలో 74.59 శాతం సన్న,చిన్నకారు రైతులు అనగా రెండున్నర ఎకరాల లోపు కల్గిన రైతులు. 2000-01లో సగటు కమతం 2.05 ఎకరాలు కాగా, 2005-06లో 1.97ఎకరాలకు తగ్గింది. గిరిజనులలో 8.63 లక్షల కమతాలు వుండగా వారివద్ద 35.70 లక్షల ఎకరాల భూమి మాత్రమే వున్నది. 2005-06 నాటికి వీరికమతాల సంఖ్య 9.27కు పెరిగింది. విస్తీర్ణం 29.95 లక్షల ఎకరాలకు తగ్గింది. అనగా, గిరిజనుల భూములు గిరిజనేతరులకు దాదాపు 6లక్షల ఎకరాలు బదిలీ అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో దళితులు, గిరిజనులు క్రమంగా తమ ప్రధాన ఆదాయవనరుగా వున్న భూమినుండి తరిమివేయ బడుతున్నారు. వ్యవసాయరంగంలో అధునాతన యంత్రాలు రావడంతో ఉపాధిని కూడా కోల్పోయి, పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. వీరి ఆదాయాలు పెంచడానికి బడ్జెట్ కేటాయింపులు బాగా పెంచుతున్నామంటూ ప్రభుత్వం బడాయి వాదనలు చేస్తున్నది.

## బడ్జెట్ కేటాయింపులు

2006-07లో రాష్ట్ర ప్రణాళికా బడ్జెట్ రు. 32973 కోట్లు కాగా, సాంఘిక సంక్షేమశాఖకు రు. 1719 కోట్లు మాత్రమే కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం మొత్తం బడ్జెట్‌లో 16.2శాతం దళితులకే కేటాయించారు. 4.6శాతం గిరిజనులకు కేటాయించారు. ఈ నిబంధన స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ క్రింద అన్ని శాఖలనుండి పై విధంగా కేటాయించాలని స్పష్టమైన ఆదేశాలున్నాయి. కేంద్ర ప్రణాళికాబోర్డు దీనిని అంగీకరించింది. 2005-06 సంవత్సరంలో దారిద్ర్యరేఖకు దిగువన వున్నవారికి కేంద్రం రు. 407.36 కోట్లు గ్రాంటుగా రాష్ట్రానికి యిచ్చింది. యిప్పటికీ దాదాపుగా రు. 22వేల కోట్లు స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్‌కు రావాల్సిన నిధులు దారిమళ్ళాయి. ప్రస్తుత ప్రణాళికా బడ్జెట్‌లో 16.2శాతం (రు. 5341.63కోట్లు) దళితులకు కేటాయించాలి. అలాగే, గిరిజనులకు 4.6శాతం (రు. 1516.76 కోట్లు) కేటాయించాలి. గిరిజన సంక్షేమ బడ్జెట్ 2007-08 సంవత్సరానికి రు. 719.24 కోట్లు కేటాయించారు. యిందులో సంక్షేమానికి 66శాతం మాత్రమే. 1975లో గిరిజన సబ్ ప్లాన్ నిర్ణయించారు. దాని ప్రకారం 10 ఐటిడిఏ, 41 మాడా, 17 క్లస్టర్లు 12 ఆదిమ గిరిజన సమూహాలు ఏర్పాటుచేశారు. ఈ సంస్థలకు కేటాయింపులు అత్యల్పం. ఈ కేటాయింపులు చేయాలన్న స్పృహ ప్రభుత్వానికి వున్నట్లులేదు. ఈ సంస్థల చుట్టూ నిత్యం పేదలు పథకాల మంజూరీల కొరకు తిరుగుతూనే వుంటారు. మైదాన గిరిజనులు నేడు అత్యంత హీనస్థితిలో తమ ఆడపిల్లలను అమ్ముకొంటున్న ఘటనలు సమాజానికి తలవంపులుగా వుంటున్నాయి.

ఈ మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయ సమగ్రాభివృద్ధి ప్రణాళికను రు. 45వేల కోట్లతో ఆవిష్కరిస్తూ ఎస్సీ కార్పొరేషన్ నుండి రు. 138 కోట్లు మరియు గిరిజన కార్పొరేషన్‌నుండి రు. 64కోట్లు ఈ వర్గాలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. బడ్జెట్‌లో కేటాయించడంతో చాలామంది సంతృప్తి చెందుతారు. వాస్తవానికి కేటాయింపులు విడుదల చేయాలన్న నైతికత లేదు. అందువల్ల కేటాయింపులను దారిమళ్ళించి తమ వర్గ ప్రయోజనానికి ప్రయోజనంగా వ్యయం చేసి, దళిత, గిరిజనులకు మోచేతులు చూపుతున్నారు.

## అంటరానితనం :

నేటికీ దళితులపై అంటరానితనం కొనసాగుతూనేవుంది. రాజ్యాంగ రీత్యా దీన్ని తీవ్రమైన నేరంగా పరిగణించబడినప్పటికీ నేటికీ యిది కొనసాగుతుంది. దీని నివారణకు అటు ప్రభుత్వాలు గానీ, యిటు పాలకులు గానీ ఏ విధమైన చర్యలూ తీసుకోవడానికి సుముఖంగాలేరు. ప్రపంచంలో ఎక్కడాలేని ఈ అంటరానితనం వల్ల దేశ ఉత్పత్తికి తీవ్రమైన నష్టం కల్గుతున్నది. దళితులు, గిరిజనులు ప్రధానంగా ఉత్పత్తిలో ప్రధాన భాగంగా వున్నారు. ఏ రంగంలోనైనా వీరి శ్రమ లేకుండా ఉత్పత్తిలేదు. అనేక సంఘాలు అంటరానితనం నిర్మూలనకు ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం నేరం చేసినవారిపై చర్యలు తీసుకోవడంలేదు. కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కెవిపియస్) నాయకత్వాన ఆందోళనలు చేయగా, వారిపై నాటి తెలుగుదేశం ప్రభుత్వం క్రూర నిర్బంధకాండ సాగించింది. ప్రభుత్వం చివరకు జస్టిస్ పున్నయ్య కమిషన్ వేసింది. ఈ కమిషన్ అనేక సిఫార్సులు చేస్తూ నివేదిక సమర్పించింది. ఆ నివేదికను అమలు చేయడానికి మరొక స్వతంత్ర్య ప్రతిపత్తిగల్గిన వ్యక్తిని నియమించాలని కోరగా, ఆ జస్టిస్ పున్నయ్యగారినే నియమించింది. వారి పదవీ కాలం ముగిసిన తర్వాత తిరిగి నియమించడానికి నేటి ప్రభుత్వం నిరాకరించింది. దీనిపై తీవ్ర ఆందోళనలు చేపట్టగా ఈ మధ్య నూతన నియామకం చేసింది. అయినప్పటికీ, యిప్పటికీ ప్రతి గ్రామంలో ఈ దుష్ట సాంప్రదాయం కొనసాగుతూనే వుంది.

## అఘాయిత్యాలకు అంతం ఎప్పుడు?

ఈ వర్గాలపై నిరంతరం అఘాయిత్యాలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు సాగుతూనే వున్నాయి. పలుకుబడి కల్గినవారు నేరాలనుండి తప్పించుకుంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గణాంకాలు విస్మయం కల్గించేవిగా వున్నాయి.

1991 ఆగస్టు 6న గుంటూరు జిల్లా చుండూరులో దళితులపై మారణహోమం సాగింది. యిందులో 8మంది ఊచకోతకు గురికాగా, మరో 5మందికి తీవ్రగాయాలయ్యాయి. దళితవాడపై పెద్దఎత్తున దౌర్జన్యం సాగింది. ఈ కేసు మొత్తం దేశంలోనే సంచలనాన్ని రేకెత్తించింది. అనేక ఆందోళనల ఫలితంగా కేసును ప్రభుత్వం నేరస్థులపై పెట్టినప్పటికీ విచారణలో తగినంత శ్రద్ధ చూపలేదు. నేరస్తులపై చర్యలను చేపట్టాలని శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న వారిపై 1991 ఆగస్టు 19న పోలీసులు కాల్పులు జరిపి కొమ్మెర్ల అనిల్ కుమార్ మృతికి కారకులయ్యారు. కేసును వాయిదాలపై వాయిదాలు వేసి 2003 ఆగస్టు 4న చుండూరులో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారు. 2004 డిసెంబర్‌లో ప్రారంభమైన విచారణ 3 సంవత్సరాలు

తీసుకుంది. గుంటూరులోని ప్రత్యేకమైన ఈ కేసులో 219మందిని నిందితులుగా పేర్కొనగా, తీర్పు వచ్చేనాటికి వారిలో 33మంది మరణించారు. నేటికీ 7గురి ఆచూకీ లభించలేదు. మిగిలిన 179 మందిపై విచారణ జరిపి జూలై 31, 2007న (16యేండ్ల తర్వాత) తీర్పు వచ్చింది. అందులో 56 మందికి శిక్షలు విధించగా, ఆ శిక్ష పడినవారిలో 21మందికి జీవితఖైదు, మిగిలినవారికి యేడాది జైలు శిక్ష విధించారు. ఆ సందర్భంగా అఘాయిత్యాలకు గురయినవారు నేటికీ కోలుకోలేదు. 16 సంవత్సరాల అనంతరం వచ్చిన తీర్పు వల్ల నష్టపోయిన వారికి జరిగిన లాభం ఏ మేరకు? యిలాంటి కేసులు రాష్ట్రంలో కోకొల్లలుగా జరుగుతున్నా పట్టించుకొన్న వారులేరు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సూచనల మేరకు ప్రతివారం సబ్ ఇన్‌స్పెక్టర్ దళితవాడకు వెళ్ళి పర్యటన చేయాలని వున్నప్పటికీ ఆచరణలో అమలు కాలేదు.

## కార్పొరేటీకరణ - ఫలితాలు

1997 - 1998 నుండి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పునర్నిర్మాణ పథకం పేరుతో ప్రపంచబ్యాంకు రాష్ట్ర ఆర్థిక, సాంఘిక విధానాలపైన క్రమంగా ఆధిపత్యాన్ని చేజిక్కించుకొంది. యీ పథకం పేరుతో సామాన్యులకు ప్రభుత్వాన్ని అందుబాటులో లేకుండా దూరం చేస్తున్నది. ప్రయివేటీకరణ జపం పేరుతో సంక్షేమ పథకాలకు కోత విధిస్తున్నది. చివరకు వెనుకబడిన ఈ పల్లెలను మరింత పేదరికంలోకి నెట్టివేస్తున్నది. గ్రామీణ ప్రాంతంలోని యీ దళిత పీడిత వర్గం క్రమంగా పట్టణాలవైపు వలసలు వెళ్తున్నారు. యింతకముందున్న కనీస సౌకర్యాలకు నేడు వీరు దూరమయ్యారు. ప్రయివేటీకరణ క్రమంగా కార్పొరేటీకరణలోకి అడుగిడుతున్నది. గ్రామాల్లో వీరికున్న కొద్దిపాటి భూములను ప్రభుత్వం సేకరిస్తూ బహుళజాతి సంస్థలకు కట్టబెడుతున్నది. తిరిగి పునరావాసం కల్పించుకోలేక పోతున్నారు. గ్రామాలపై ఆధారపడి జీవిస్తున్నవారు నిర్వాసితులుగా మారి సంచార జీవితం గడపాల్సిన స్థితి నెలకొన్నాయి. వాటి ఫలితాలు ఈ విధంగా వున్నాయి.

1. వీరికివున్న కొద్దిపాటి ఆస్తులు కోల్పోతున్నారు. సమాజానికి దూరంగా నెట్టివేయబడుతున్నారు.
2. విద్య- ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కోతపడ్డాయి.
3. నిర్ణీత ఉద్యోగాలు అందుబాటులో లేవు. బహిరంగ పోటీలో ఈ వర్గాలు నిలబడలేవు.
4. సంక్షేమ పథకాల్లో కోతలు సాగుతున్నాయి.
5. విద్య, వైద్యం అందుబాటులో లేకుండా పోయాయి.
6. గ్రామాలనుండి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి.
7. రాజ్యాంగం కల్పించిన రక్షణలు పనికిరాకుండా పోయాయి.
8. అంటరానితనం పెరుగుతున్నది.
9. దారిద్ర్య నిర్మూలన పథకాలు దరిద్రులను నిర్మూలించే (నశింపజేసే) పథకాలుగా మారాయి.
10. కూడు, గూడు, గుడ్డ, ఉపాధిల కొరత ఈ వర్గాల్లో అనూహ్యంగా పెరుగుతున్నది.

**పరిష్కారం :**

ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా దిగజారిపోతున్నారు. తక్షణమే ప్రస్తుత విధానాలకు భిన్నమైన విధానాలను రూపొందించుకోవాలి. ప్రధానంగా ప్రతి కుటుంబానికి రెండెకరాల భూమి యివ్వాలి. ప్రతి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలి. విద్య, వైద్యం, వైద్యం అందుబాటులో వుంచాలి. వీరిని సమాజంలో ఒక భాగంగా చేయాలి తప్ప, సమాజానికి దూరంగా వుంచరాదు. ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలి.బడ్జెట్‌లో వీరికి తగినన్ని నిధులు కేటాయించాలి. అంటరానితనాన్ని నిరోధించే చర్యలు ప్రభుత్వం చేపట్టాలి. దీనికై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి. వీరి సమస్యలు పరిష్కరించేందుకు మండల స్థాయి కమిటీలు వేయాలి. దళితుల అభివృద్ధికి కృషి చేసినప్పుడే వారు సమాజంలో భాగస్వాములు కాగలరు. ●

---

( 3వ పేజీ తరువాయి ..... )

స్త్రీల భాగస్వామ్యం ఉంది ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కారంచేడు, నీరుకొండ, కొత్తకోట, పిప్పర, టంగుటూరు, చుండూరు దుర్మార్గపు సంఘటనలకు వ్యతిరేకంగా దళిత స్త్రీలు ఉద్యమించారు. చారిత్రాత్మక సారా వ్యతిరేక ఉద్యమంలో పల్లెపల్లెలో పోరాటాన్ని నడిపింది దళిత స్త్రీలే.

దేశంలో అనేకచోట్ల దళిత మహిళా సంస్థలున్నాయి. జాతీయ స్థాయిలో 1990 దశకంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ దళిత్ ఉమెన్ ఏర్పాటైంది. క్రమేపి దళితుల, దళిత మహిళల ఉద్యమం జాతీయ ఎల్లలు దాటి అంతర్జాతీయంగా తమ అస్తిత్వాన్ని చాటింది. 2001 దర్బన్ నుండి 2006లో హేగ్‌లో జరిగిన అంతర్జాతీయ దళితా మహిళా సదస్సులో అనేకమంది దళిత స్త్రీలు పాల్గొని అన్యాయాలకు అణచివేతకు వ్యతిరేకంగా తమగళం విన్పించారు.

ఆరు దశాబ్దాల స్వతంత్ర భారతంలో దళితులు ముఖ్యంగా దళిత స్త్రీల స్థితిగతుల్లో కొంత పురోగతి కన్పిస్తుంది, కానీ మౌలికంగా అంతర్గతంగా సమాజంలో వివక్షలు, అన్యాయాలు, అసమాతనలు పూర్తిగా పెకిలించబడలేదు. ప్రభుత్వ పథకాల ఉద్దేశ్యం మంచిదే అయినా పటిష్ట యంత్రాంగం లేనిదే అవి నిజమైన ఆచరణకు నోచుకోవు. అణగారిన వర్గాలసంక్షేమబాధ్యతని ప్రభుత్వం విధిగా తీసుకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. కేవలం ఓటుబ్యాంకు రాజకీయాలకు ప్రభుత్వాలు దళితుల సంక్షేమం పట్ల ఉదాసీనత చూపటం విచారకరం. వనరుల్లో భాగస్వామ్యం, మౌలిక సదుపాయాలకు ఇంకా దళితులు దూరంగానే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని ఏళ్ళకు కూడా దళిత స్త్రీలపై అత్యాచారాలు అంటరానితనం, అణచివేత, మానవత్వానికీ, మానవహక్కుల సాధనకు పెద్ద సవాలు. ఈ హక్కుల సాధన ఒక్క దళితుల సమస్యే కాదు- దేశ సమస్య కూడా.

# భూమి - దాని ప్రాధాన్యత

...✍ యస్. దేవకుమార్

మనిషి బ్రతకడానికి ఆహారం ముఖ్యం. ఆహారం మనం తయారుచేయగలిగేది కాదు. ఆహారపదార్ధాల ఉత్పత్తికి ఖచ్చితంగా భూమి వుండాల్సిందే. భూమి లేకుంటే పంటలు లేవు. పంటలు లేకుంటే ఆహారపదార్ధాలు లేవు. అందుకే ప్రకృతి ప్రసాదించిన అతి ముఖ్యమైన సహజవనరు భూమి అని చెప్పొచ్చు.

భూమికి యింత ప్రాధాన్యం ఉంది కాబట్టే భూమిపై యాజమాన్యం కోసం మొదటి నుండి ప్రజల మధ్య ఘర్షణ జరుగుతూ వస్తుంది. అయితే భారతదేశంలో సామాజిక స్థితిగతులు భూ యాజమాన్యాన్ని నియంత్రించాయి. భారత సామాజిక వ్యవస్థ నిచ్చెనమెట్ల వ్యవస్థ అని అంబేద్కర్ పేర్కొన్నారు. ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థలో అడుగున వున్న వ్యక్తులు అంటరానివారు, లేదా దళితులు. అన్నింటికన్నా పై మెట్టులో బ్రాహ్మణులు, రెండో మెట్టులో క్షత్రియులు, మూడో మెట్టులో వైశ్యులు నాలుగో మెట్టులో శూద్రులు వున్నారు. భూమి మొత్తం మీద అధికారం రాజుదే అయినా శూద్ర వర్ణానికి వ్యవసాయం చేసే పని అప్పగించబడింది. శూద్రులు భూమిని దున్నడం, దానిని పండించడం, రాజ్యానికి చెందాల్సిన పంటను వారికి ఒప్పజెప్పడం మొ॥ అన్నీ శూద్రుల బాధ్యతలు. ఈనాటి రెడ్డి, కమ్మ కులస్తులు ఒకనాడు శూద్రులుగానే పరిగణింపబడేవారు. శూద్రులకన్నా అడుగున వున్న మరొకవర్గం అంటరానివారు. వీరికి సామాజిక వ్యవస్థలో గుర్తింపు లేదు. అందువల్లే వీరికి సామాజిక ఉత్పత్తిలో భాగమయ్యే ఏ పనీ ఒప్పగించబడలేదు. వీరికి అంటగట్టబడిన పనులన్నీ రోతగా అసహ్యాన్ని పుట్టించేవి పై వర్ణాలు ఏవీ చేయడానికి యిష్టపడని పనులు. ఉదా॥ శవాలు కాల్చడం, చెత్తా చెదారం శుభ్రం చేయడం, మృతకళేబరాలు పారవేయడం మొదలగునవి. ఈ క్రమంలో వీరికి భూమి కలిగి వుండే హక్కు లేకుండా చేయబడింది. వ్యవసాయం చేయడంపై వీరికి నిషేధం విధించబడింది. కేవలం అగ్రవర్ణాల మీద ఆధారపడే వారుగా చేయబడ్డారు. అందుకే నేటికీ ఎక్కువ మొత్తంలో భూములున్న దళితుల్ని చూడలేము. ఒకవేళ ఏ దళితుడైనా భూమిని కొని వ్యవసాయం చేసి బ్రతుకుతు న్నాడంటే సామాజికంగా ముందున్న అగ్రవర్ణాలు సహించలేవు. అందుకే అత్యాచారాలు చేసి భూమిని లాగేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

**ఫ్యూడల్ వ్యవస్థ - భూ యాజమాన్యం**

మధ్యయుగాలలో ఫ్యూడల్ ప్రభువులు భూమి మీదపూర్తి అధికారాన్ని కలిగి యుండి దానిని వారికిష్టమైన వారికి ఇనాంలుగాను, దేవాలయాలకు, ధర్మ కార్యక్రమాల నిర్వహణకు వందలు వేల ఎకరాల భూమిని ధారాదత్తం చేసారు. ఈ క్రమంలోనైనా దళితులకు ఏ మాత్రం భూమి దక్కలేదు. భూమి మీద పన్ను వసూలు చేసి కట్టడానికి గాను జమిందార్లని, జాగీర్దార్లని నియమించారు. ఈ జమిందార్లు, జాగీర్దార్లు కూడా అగ్రవర్ణాల వారే తప్ప దళితులెవరు ఈ జాబితాలో లేరు. అంతేకాకుండా చక్రవర్తులు, రాజులచే నియమింపబడిన సామంతరాజులకు కూడా భూమిపై అధికారం ఉండేది. అట్టి సామంతురాజుల్లో దళిత సామంతరాజులు ఒక్కరూ లేరు. అంటే సామాజిక మార్పు ఎట్లా జరిగినా ఆ మార్పు వల్ల దళితులకు ఒరిగిందేమీ లేదు. ఈ మార్పుల్లో ఎక్కడాభూమిపై వీరికి హక్కులు రాలేదు.

కొన్ని వేల సంవత్సరాలు నిరంతరాయంగా కొనసాగిన అగ్రకులాల భూ యాజమాన్యం భారతదేశం స్వతంత్రం సంపాదించుకొనే వరకు కొనసాగింది. ఫ్యూడల్ భూస్వామ్య విధానంలో ఎవరు ఎక్కువ భూమిని కలిగి వుంటే వారికే సామాజిక భద్రత వుంటుంది. సామాజిక గౌరవం దక్కుతుంది. వాళ్ళే నాయకులై ప్రజల మీద పెత్తనం సాగించగలిగే హోదాలలోకి ఎదుగుతారు. వారి పిల్లలకే చదువు సంధ్యలు, మంచి ఉద్యోగాలు లభిస్తాయి.

ఏ మాత్రం భూమిలేని దళితులు భూస్వాముల దగ్గర కూలీలుగా పడి వుండేవాళ్ళు. ఏ కరువు కాటకాలు వచ్చినా ఏ ఉపద్రవం వచ్చినా మొదటగా బలయ్యేది దళితులే. అనారోగ్యంలో ఆకలి మంటల్తో మరణించే వాళ్ళ సంఖ్య కూడా దళితుల్లోనే ఎక్కువ. దీనంతటికీ దళితులకు భూమి లేకపోవడం ఒక కారణంగా పేర్కొనవచ్చు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భూమిలేని పేదలకు భూమిని యివ్వాలనే కొంత ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నం సఫలం కావాలంటే ముందుగా భూ యాజమాన్య హక్కులు నియంత్రించాలి.ఈ నియంత్రణ కోసమే మొదటి రాజ్యాంగ సవరణ జరిగింది. 1951 ముందు భూమిని కలిగి వుండడం ఒక ప్రాథమిక హక్కుగా వుండేది. అయితే దానిని 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 31వ అధికరణలో సవరించారు. దాని ద్వారా జమిందారీ, జాగీర్దారీ భూములను రద్దు చేయడానికి మార్గం సుగమమైంది. భూ సంస్కరణలకు రంగం సిద్దం చేసి అనేక చట్టాలు చేసింది.

**భూసంస్కరణలు :**

ఈ క్రమములో ప్రభుత్వం చేసిన కొన్ని చట్టాలు, మరియు కొన్ని సంస్కరణ చర్యలు పేర్కొనదగినవి. అప్పటికే భూస్వాముల భూముల్లో కౌలుదారులుగా వున్న వారికి భూ యాజమాన్య హక్కులు కల్పించే ఉద్దేశ్యంతో ఈ క్రింది చట్టాలు చేయడం జరిగింది.

1. "ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ఏరియా) ఇనాంల రద్దు చట్టం" -1955
2. 1358 ఫసలీ సంవత్సరంలో (అంటే 1948 సం॥రంలో "హైదరాబాద్ (జాగీర్ రద్దు) రెగ్యులేషన్స్" చేయబడింది. దీని ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో ఉన్న జాగీర్లు రద్దై భూమి ప్రభుత్వ పరం అయింది.
3. 1358 ఫసలీ సంవత్సరంలో (అంటే 1948 సం॥రంలో) "ది సర్ఫ్ కాస్ (మెర్జర్) రెగ్యులేషన్స్" చేయబడింది.
4. ది ఆంధ్రప్రదేశ్ భూదాన్ మరియు గ్రామదాన్ చట్టం - 1965
5. " ది ఆంధ్రప్రదేశ్ ఎస్సైన్‌మెంట్ భూముల (బదలాయింపు నిషేధ) చట్టం 1977.
6. 'ది ఆంధ్రప్రదేశ్ షిక్మిదారుల పట్టదారీ హక్కుల నిబంధనలు" 1964
7. ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణల (వ్యవసాయ భూముల గరిష్ట పరిమితి) చట్టం - 1973
8. ఆంధ్రప్రదేశ్ లాండ్ రెవిన్యూ చట్టం - 1967

( తరువాయి 9వ పేజీలో ..... )

# స్త్రీలు రక్షణ చట్టాలు

...✍ మేడిగ ధర్మరాజు

మనువాద సంస్కృతిలో స్త్రీలు అనాదిగా అణచివేతకు గురయ్యారు. ప్రతివిషయంలో స్త్రీల కన్నా పురుషులే మిన్న అనీ, స్త్రీలు చిన్నతనంలో తల్లిదండ్రుల మీద, పెండ్లయిన తరువాత భర్త మీద, వృద్ధాప్యంలో పిల్లల మీద, ఆధారపడాలన్న మనువాదాన్ని సమూలంగా నాశనం చేసి, స్త్రీ పురుషులు సమానమేనని, ఆ సమానతల్ని సాధించటానికి చట్టాలు, సమాజం ప్రభుత్వం తోడ్పడాలని భారత రాజ్యాంగం పేర్కొంటున్నది. అందుకు అనుగుణంగా స్త్రీల అభివృద్ధిని కాంక్షిస్తూ అనేక చట్టాలు వెలుగులోకి వచ్చాయి. వాటిలో ముఖ్యమైనవి.

**భారత రాజ్యాంగం 14వ అధికరణ :**

స్త్రీ పురుషులు సమానమేనని ఏవిధమైన లింగ వివక్ష చూపరాదని ఈ అధికరణ పేర్కొనుచున్నది.

**సమానవేతన చట్టం - 1976 :**

ఈ చట్టం స్త్రీ పురుషులకు సమానమైన పనికి సమాన వేతనం యివ్వాలని పేర్కొనుచున్నది.

**భారతరాజ్యాంగం 39వ అధికరణ :**

స్త్రీలను పురుషులతో పాటు సమానమైన హోదా, గౌరవం కలుగుజేయాలని పేర్కొనుచున్నది.

- నేరశిక్షాస్మృతి చట్టం - 1973
- గర్భస్థ శిశు నిర్ధారణ నిరోధక చట్టం 1994
- కుటుంబ న్యాయస్థానాల చట్టం 1984
- బలవంతంగా గర్భం తొలగింపు చట్టం 1971
- బాలల వారసత్వ చట్టం 1925
- వరకట్న నిషేధచట్టం 1961
- మహిళలను అగౌరవపరచడాన్ని నిరోధించే చట్టం 1987
- సతీసహగమన నిషేధ చట్టం 1987
- బాల్యవివాహాల నిరోధక చట్టం
- గృహహింస నిరోధక చట్టం 2005
- మహిళలకు ఆస్థి వారసత్వ హక్కు చట్టం - 2005

**వరకట్నపు చావులు సెక్షన్ ఐ.పి.సి సెక్షను 304-బి**

1. చనిపోయిన స్త్రీకి చట్టపరంగా వివాహం అయి ఉండాలి.
2. వివాహం అయిన 7 సం॥ లోపు చనిపోయి ఉండాలి.
3. కాలిన గాయాలు తగిలిన దెబ్బలు వంటి గుర్తులు వైద్యనిపుణులు ధృవీకరించాలి.
4. వరకట్నం నిషేదపు చట్టం 1961 సెక్షన్ 2 క్రింది కూడా వరకట్న చావును గురించి తెల్పడం జరిగినది. వరకట్నం కొరకు హింసల వలన 7 సం॥లలోపు చనిపోవటం జరగాలి.

*సూచిక : స్త్రీలపై నేరం జరిగిన వెంటనే ఈ క్రింది జాగ్రత్తలు తీసుకొనవలెను.*

1. పోలీసులకి వెంటనే రిపోర్టు చేయాలి.
2. పోలీసులకి ఇచ్చిన రిపోర్టును జతపరచి ఒక అర్జీని ఎంఆర్ఓ గారికి, ఆర్‌డిఓ, గారికి, కలెక్టర్ గారికి, సమర్పించాలి లేఖ పంపాలి.
3. నేరం జరిగి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి వైద్య నిపుణుల చేత పరీక్ష చేయించుకొని ధృవీకరణ పత్రంను పొందాలి.
4. బలమైన సాక్ష్యాలను సేకరించాలి.
5. ప్రభుత్వం దగ్గరనుండి ఆర్థిక సహాయం కొరకు అర్జీపెట్టాలి.
6. స్త్రీ సంఘాలతో సంప్రదించి మద్దతును పొందాలి.
7. తీవ్రమైన నేరాల విషయంలో మరణ వాంగ్మూలం రికార్డు చేయించాలి.
8. ఎన్నికల్లో రిజర్వేషన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి.
9. పాకీ వృత్తిని, వెట్టిచాకిరీని నిర్మూలించడంలో అశ్రద్ధ వద్దు.
10. దళితులు ఆదివాసీలు నివసించే ప్రాంతాలలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలి.

**గృహహింస : వేధిస్తే నష్టపరిహారం**

స్త్రీలలో కూడా అసమానతలను ఎదుర్కొంటున్న వారు దళిత స్త్రీలకు రక్షణ కల్పించే అంశాలు కూడా అనేక చట్టాలలో పొందుపర్చబడ్డాయి. ఉదా :

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలపై (అత్యాచారాల నిరోధక చట్టం - 1989)

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలపై (అత్యాచారాల నిరోధక) నిబంధనలు - 1995

పౌరహక్కుల పరిరక్షణ చట్టం - 1956

పై చట్టాలు దళిత స్త్రీలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తాయి.

- ఉమ్మడి ఆస్తులను అమ్మడానికి వీలు లేకుండా ఉత్తర్వులు పొందవచ్చు.
- ఉమ్మడిగా ఉన్న బ్యాంక్ ఖాతాలు, లాకర్ల వినియోగాన్ని అరికట్టవచ్చు.
- బాధితురాలికి అండగా నిలిచిన వారిపై ప్రతివాది ఎటువంటి దాడికి, పూనుకోకూడదు. ఈ రకంగా భద్రతా అదేశాలు పొందవచ్చు.
- ఇంటిపై యాజమాన్యపు హక్కు లేకపోయినా సరే ఆమెను ఇంటినుంచి, గెంటివెయ్యడానికి ఎవరికీ అధికారం లేదు.
- ఆమెను వేరే ఇంట్లో వుంచడం మంచిదనుకుంటే అద్దె తదితర ఖర్చులు ప్రతివాది భరించాలి. ఈ విధమైన ఆదేశాలు మెజిస్ట్రేట్ జారీ చేయవచ్చు.
- ప్రతివాది వేధింపుల వల్ల బాధితురాలు ఆర్థికంగా నష్టపోతే దాన్ని పూడ్చవలసిన బాధ్యత అతనిదే.

❖ అతని వేధింపుల వల్ల ఆమె ఆరోగ్యం చెడిపోతే, వైద్యానికయ్యే ఖర్చు ప్రతివాది భరించాలి.

❖ బాధితురాలే పిర్యాదు ఇవ్వాలని లేదు. ఆమె తరపున ఆమె బంధువులు, పక్కింటివారు, సామాజిక కార్యకర్తలు, ఎవరైనా ఇవ్వవచ్చు.

❖ సంఘటన పరిస్థితుల దృష్ట్యా బాధితురాలికి, మధ్యంతర ఉపశమనాలు మెజిస్ట్రేటు జారీ చేస్తారు.

❖ ప్రతివాది కోర్టుకు హాజరు కాకపోతే-ఎక్స్-పార్టీ అదేశాలు జారీ చేస్తారు.

❖ ఈ చట్టం కింది మనోవర్తి పొందవచ్చు.

❖ బాధితురాలు కోర్టులో కేసు వేయనక్కరలేదు. తాను ఎదుర్కొంటున్న సమస్యలు, రాత పూర్వకంగా గాని, మౌళికంగా గాని, తమకు దగ్గరకు ఉన్న స్వచ్ఛంద సంస్థకు పిర్యాదు చేయవచ్చు.

❖ మెజిస్ట్రేట్ కౌన్సిలర్స్‌ని అపాయింట్ చేస్తారు. వీరిలో ఎక్కువ శాతం మహిళలే వుండటానికి అవకాశం ఉంది.

❖ బాధితురాలు కోరిన మీదట, కౌన్సిలర్ పరిష్కారం సూచించవచ్చు.

❖ పరిష్కారం ఇరువర్గాల వారికి అమోదయోగ్యంగా వుంటే, ఒక రిపోర్టు తయారు చేసి, వారికి తెలిసిన భాషలో, దానిలోని విషయం అర్థమయ్యేలా తెలియజేసి వారి ఆమోదం తీసుకొని ఆ రిపోర్టు కోర్టుకు పంపటం జరుగుతుంది.

❖ ఈ చట్టం కింద ఉపశమనాలన్నీ తిరిగి బాధితురాలు వెనక్కి తీసుకోమని అడిగే వరకూ, శాశ్వతంగా అమలులో ఉంటాయి.

❖ ప్రతివాది కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ఎడాది జైలు శిక్ష రూ. 20,000/- జరిమానా విధిస్తారు.

❖ ఈ చట్టం అమలు బాధ్యత మహిళా శిశు సంక్షేమశాఖకు అప్పగిస్తారు.

**రక్షణ కల్పించే యితర చట్టాలు :**

❖ కర్మాగారాల చట్టం - 1948

❖ కనీస వేతనాల చట్టం - 1948

❖ సమాన పారితోషిక చట్టం - 1976

❖ వ్యవసాయ కార్మిక చట్టం - 1951

❖ వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం 1976

స్త్రీ పురుషుల మధ్య వివక్షను తొలగించి పురుషులతో సమానంగా మహిళలకు వేతనాలు ఇవ్వడానికి 1976లో సమానవేతన చట్టం రూపొందించారు. రాజ్యాంగంలో స్త్రీ పురుషులం సమానమని ఆర్టికల్ 14లో మౌలిక సూత్రంగా ఉంది, ఆర్టికల్ 39లో నిర్దేశించి ఆదేశిక సూత్రాల ప్రకారం మహిళలకు పురుషులతో సమానమైన అంతస్తు హోదా కలగజేయడానికి, వివాహ వ్యవస్థలో, వంశపారంపర్య హక్కులలో ఆమెపై జరిగే హింస నుండి రక్షణ కలిగించడానికి ప్రభుత్వం ఎన్నో చట్టాలు ఏర్పాటు చేసింది. ఆదేశిక సూత్రం పాటించడం కోసం 1975లో రాష్ట్రపతి సమాన ప్రతిఫల ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. జనవరి 11, 1976లో చట్టం రూపొందించారు. స్త్రీలకు రక్షణ కల్పించడానికి ప్రభుత్వం ఎన్నో శాసనాలు చేసింది. ●

(➜ 7వ పేజీ తరువాయి ..... )

9. ఆంధ్రప్రదేశ్ భూ రికార్డుల హక్కు చట్టం - 1971
10. ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ఏరియా) రక్షిత కౌలుదారు చట్టం - 1956

పై చట్టాలే కాకుండా అనేక ప్రభుత్వ ఆర్డర్లు ద్వారా పోరంబోకు భూములను పంచడానికి, అంతకుముందే ప్రభుత్వ భూములను సాగుచేసుకున్న వారికి పట్టాలు యివ్వడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. భూసంస్కరణల చట్టాలు జరిగాయి కాని వాటి అమలులోకి వచ్చే సరికి అనేక విధాలుగా ఎంతో భూమి మళ్ళీ భూస్వాముల చేతుల్లోనే చిక్కుపడిపోయింది. దీనికి అనేక కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనవి. 1. చట్టాల అమలులో జాప్యం 2.కోర్టు కేసుల ద్వారా ప్రభుత్వానికి స్వాధీనం చేయకుండా ఆపగలగడం. 3. భూమి పట్టాలు యిచ్చినా అధికారాలు భూస్వాముల దగ్గర నుండి భూమిని స్వాధీనం చేసుకొని లబ్దిదారులకు స్వాధీనం చేయకపోవడం. 4.అధికారులు రికార్డులు తారుమారు చేయడం వల్ల లబ్దిదారులకు చెందకుండా చేయగలగడం. 5. కోర్టు కేసులు పరిష్కారం అయినా భూములను స్వాధీనం చేసుకోవడంలో అలసత్వం ప్రదర్శించడం.

**పంపకాలు చేసిన భూముల్లో ఎదురయ్యే ఇబ్బందుల్లో కొన్ని :**

1. సాగుకు పనికిరాని భూములను భూమి లేని నిరుపేదలకు యివ్వడం వల్ల వాటిని సాగు చేసుకోలేక పోవడం.

2. భూమిని సాగులోనికి తెచ్చే ఆర్థికస్థోమత లేకపోవడం.

3. బ్యాంకు రుణాలు తీర్చలేకపోయిన సందర్భాలలో కోర్టు కేసుల ద్వారా బ్యాంకులు ఆర్డరు పొంది పొలాన్ని వేలం వేసి లబ్దిదారునికి నష్టం కలుగజేయడం.

భూమి లేని నిరుపేదలకు యిచ్చే ఉద్దేశ్యంతో అనేక శాసనాలు చేసినా అనేక ప్రభుత్వ జీవోలు వున్నా ఇప్పటికీ దళితుల్లో భూమి లేనివారే ఎక్కువ. దీనికి కారణం చట్టాల అమలు పటిష్టంగా లేకపోవడమే. తరతరాలుగా భూమికి దూరం కావడమంటే ఆత్మగౌరవానికి జీవనభద్రతకు తాము దూరం కావడమే. ఇంతకాలం సామాజిక వ్యవస్థలో భాగం కాకుండా దూరంగా నెట్టివేయబడిన దళితులకు భూ పంపిణీ సక్రమంగా జరిపి ప్రతి కుటుంబానికి కనీసం 2 1/2 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట వుండే లాగ చర్యలు చేపట్టగలిగితే దళితులకు ఆత్మగౌరవం, జీవనోపాధి కల్పించవచ్చు. ఒకసారి ఆత్మగౌరవం, జీవన భద్రత వుంటే సామాజిక ఎదుగుదల, విద్యా ఉద్యోగావకశాలు చేజిక్కించుకోవడం, మొదలైన అంశాలు అన్నింటిలోను ముందుకొస్తారు. కాబట్టి దళితులు చేయాల్సిందల్లా. (1) భూములను వీలైనంత వరకు సంపాదించాలే కాని వాటిని అమ్ముకొనకూడదు. (2) భూ సంస్కరణ చట్టాల అమలుకై ప్రభుత్వం పై వత్తిడి తీసుకురావాలి. (3) ప్రభుత్వ భూములు ఖాళీగా వుంటే వాటిని గుర్తించి సాగు చేసుకోవాలి. 4. అక్రమంగా భూములు ఆక్రమించుకొన్న వారిపై ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాలనిరోధక) చట్టం 1989 క్రిందకేసులు పెట్టాలి. 5. దళితులే భూ పరిరక్షణ కమిటీలుగా ఏర్పడి భూములు స్వాధీనం చేసుకొని, భూములు కాపాడుకోవాలి. ●

# నిత్య సంఘర్షణల కొలిమి - స్వాతంత్ర్యానంతర దళిత జీవితం

...✍ బత్తుల కొంతయ్య

ప్రపంచంలో వలసదోపిడి పాలనలో నలిగిపోయిన అనేక దేశాలు పోరాటాల ద్వారా లేదా ఒప్పందాల ద్వారా విదేశీయుల పాలన నుండి బయటపడి స్వతంత్రపాలనను స్థాపించుకొన్నాయి. 1947 ఆగష్టు 15న భారత అగ్రకులాలకు బ్రిటీష్ వారికి మధ్య జరిగిన ఒప్పందం మూలంగా భారతదేశం కూడా స్వాతంత్ర దేశంగా నమ్మించబడుతూ ఉంది. దేశంలోని అత్యధిక జనం అవిద్య, అనారోగ్యం, ఆకలి, అణచివేతలతో రోజు చస్తూ బ్రతుకుతూ ఉంటే, భారతస్వాతంత్ర్యం తన 60 యేళ్లలో పూర్తి చేసుకుంటున్నది. "పిల్లవాడి పిర్రను చూస్తే ఇంటిలోని పుష్టి అర్థమయినట్లు ఈ దేశంలోని దళితులు, మహిళలు ఆదివాసుల సామాజిక ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నాయనేదే ఈ దేశాభివృద్ధిని లెక్కించేందుకు సూచికలు. అయితే 1990 తర్వాత దేశంలో జరుగుతున్న "అభివృద్ధికి" దళితులు ఆదివాసులు కేవలం బాధితులుగా, నిర్వాసితులుగా మారుతున్నారు. 2005 నుండి మొదలైన ప్రత్యేక ఆర్థికమండళ్ళు (సెజ్) బక్క రైతులనూ కూలీలను మొత్తంగా తుడిచిపెట్టే దుర్మార్గం "స్వదేశంలోనే ఒక విదేశాన్ని" స్థాపించే ఈ ప్రత్యేక ఈ ఆర్థిక మండళ్ళు దేశమంతటినీ సింగూరు, నందిగ్రామ్‌లు చేయబోతున్నాయి. భారత స్వాతంత్ర్యంలోని డొల్లతనాన్ని వెల్లడి చేస్తున్నాయి.

అసమానతల మనుధర్మాన్ని స్థిరం చేసిన స్వాతంత్ర్యం దళితులకూ ఒక్క అమలుకాని రాజ్యాంగాన్నీ ఇంకా అమలుకాని చట్టాలనూ అసలే అమలుకాని అనేక ఆదర్శాలనూ ఇచ్చింది. "స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనండి అని గాంధీ, అంబేద్కర్‌ను పిలిచినపుడు "ఎవరి స్వాతంత్ర్యం కోసం?" అని అడిగిన బాబాసాహెబ్ ప్రశ్నకు ఎలాంటి సమాధానం లేకుండానే స్వాతంత్ర్యం వచ్చేసింది. అందుకే ఇప్పుడు అంబేద్కరీయుల ప్రశ్న ఎవరికి స్వాతంత్ర్యంవచ్చింది. అని స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న సమస్యల నుండి బయటపడలేదు కానీదళితులు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అదనపు సమస్యలకు గురి అవుతున్నది వాస్తవం. కేవలం ఆర్థిక దోపిడీ కోసం అణచివేతకూ గురిచేసిన బ్రిటీష్‌వాడి నుండి వికృత అణచివేత రూపాలు కలిగిన కుల దుర్మార్గుల చేతుల్లోకి అధికారం మార్పిడి జరిగింది. అదే నేటి భారత స్వాతంత్ర్యం. దళితుల కోసం అవకాశాలనూ ఇక్కడి అగ్రకుల సోకాల్డ్ స్వాతంత్ర్య పోరాట నాయకులు అడ్డుకున్న విషయాన్ని ఇక్కడ గుర్తుకు తెచ్చుకుంటే మంచిది. మరీ ముఖ్యంగా గాంధీ పాత్రను గుర్తుకు తెచ్చుకుంటే విషయం స్పష్టమవుతుంది.

1947 కంటే ముందు అంటే స్వాతంత్ర్యానికి ముందు దళితులపై సామూహిక హత్యాకాండలు జరిగిన సందర్భాలు తక్కువ కానీ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సహజంగానే దళితులపై ఆధిపత్యాన్ని చలాయిస్తున్న అగ్రవర్ణ భూస్వామ్య గుండాల చేతికే చట్టబద్దమైన అధికారం కూడా దక్కడంతో దళితులపై భౌతికదాడులు తీవ్రమైన సంగతి ఆయా సంఘటనలనూ గమనిస్తే అర్థం అవుతుంది. బీహార్‌లోని అగ్రకుల కిరాయి హంతక ముఠా అయిన రణబీర్‌సేన లక్ష్మీపూర్‌బాతే అనే గ్రామంపై దాడిచేసి మహిళలు, పిల్లలు, వృద్దులని చూడకుండా దాదాపు 70 మంది దళితులను హత్యచేసింది. ఇంత దుర్మార్గమయిన దాడులను స్వాతంత్రానికంటే ముందు ఊహించలేము. హంతకులకు చట్టబద్ద అధికారం దొరికితే ఏమి జరుగుతుందో ఇపుడు మన దేశంలో అదే జరుగుతుంది. పరాయి పాలనలో దళితుల మానప్రాణాలకు ముప్పు లేదు కానీ స్వాతంత్ర్యం వస్తూ వస్తూ దళితులకు జీవన్మరణ సమస్యలనూ వెంట తీసుకువచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే దళితులపై భౌతికదాడులు అధికం అయినాయి. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. హర్యానాలోని గుజ్జార్, బీహార్‌లోని శంకర్ భిఘా, తమిళనాడు లోని కీలవేణ్మని, మహారాష్ట్రలోని ఖైర్లాంజి, ఆంధ్రప్రదేశ్‌లోని కారంచేడు, నీరుకొండ, చుండూరు పందిరికుప్పం వేంపెంట లాంటి ఘటనలు దళితులపై జరిగిన, జర్గుతున్న హత్యాకాండలకూ ఊచకోతలకూ కొన్ని ఉదాహరణలు మాత్రమే. భారతస్వాతంత్ర్యం దళితులనూ పెనం మీది నుండి పొయ్యిలోకి వేసిందనే దానికి నిదర్శనాలు మాత్రమే.

### ఇదొక అనివార్య సంఘర్షణ :

మనుధర్మానికి వ్యతిరేకంగా, కులవ్యవస్థకూ వ్యతిరేకంగా ఈ దేశ పునర్నిర్మాణం కోసం, సమానత్వం కోసం చార్వాకులు బుద్దుడులతో ప్రారంభమయిన పోరాటం గురించి, ఆ పోరాటానికి అప్పటి ప్రతినిధి అయిన డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి భారతస్వాతంత్రోద్యమకారులు, జాతీయోద్యమ నాయకులుగా చలామణి అయిన వీరు పట్టించుకోలేదు. భారతస్వాతంత్ర్యం పోరాటకారుల ఎజెండాలో అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడాలనేదేమి లేదు. స్వాతంత్ర్యమంటే అంబేద్కర్ దృష్టిలో "సంపూర్ణ సామాజిక మార్పు" కేవలం అధికార మార్పిడి కాదు.

దళిత జాతుల విముక్తి కోసమే తన సర్వస్వాన్ని అర్పించిన మహనీయుడు డా॥ అంబేద్కర్ బ్రిటీష్‌వారి నుండి ఈ దేశ అగ్రకులాలకు అధికార మార్పిడి జరిగే స్వాతంత్ర్యపోరాటం అంబేద్కర్‌ను పెద్దగా ఆకర్షించలేకపోయింది. అంబేద్కర్ దృష్టి అంతా ఈ దేశంలో తిష్టవేసిన దుర్మార్గమయిన కులవ్యవస్థను ధ్వంసం చేయడం. అనాగరికమైన ఈ దేశ సమాజాన్ని నాగరిక వ్యవస్థగా మార్చడం. ఆ మహనీయుడి కృషి మేధస్సు ఫలితంగా ఉద్భవించే భారత రాజ్యాంగం. భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందు బ్రిటీష్ పాలకులతో పోరాడి దళితుల కోసం సాధించిన అవకాశాలు, అధికార మార్పిడి జరిగిన అనంతర రాజ్యాంగంలో పొందుపరచిన అవకాశాలే దళితులను ప్రస్తుతమున్న అభివృద్ధికరమైన పరిస్థితుల్లో నిలబెట్టాయి. ఈ దేశంలో దళితుల ఎలాంటి అభివృద్ధికయినా సరే ఏకైక కారకుడు డా॥ అంబేద్కర్.

మనువు ఈ దేశంలో కులవ్యవస్థను ప్రవేశపెట్టాడు అంబేద్కర్ కులనిర్మూలన సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. భారత అగ్రకులాలు మనువు వైపు నిలబడ్డారు. అంబేద్కర్ దళిత బహుజనుల వైపు నిలబడ్డాడు. అంబేద్కర్ మనువును రాజ్యాంగంలోనూ చట్టాల్లోను

( తరువాయి 13వ పేజిలో ..... )

# దళిత హక్కులే మానవ హక్కులు

...✍ డా॥ జి.వి. రత్నాకర్

స్వతంత్ర భారత దేశంలో దళితులకు కనీస అవసరాలు తీరని పరిస్థితి నేడు మనకి కనిపిస్తుంది. కనీస జీవన అవసరాలు నిరాకరించబడుతున్నచోట హక్కులు అందులోనూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కుల గురించి మాట్లాడటం అంటే అది అర్థరహితంగా కనిపిస్తుంది. భూమిపైన, శ్రమపైన జీవనాధార వనరులపైనా విద్య, ఉపాధి, రిజర్వేషన్లు, జీవనభద్రత, రక్షణ, దళితస్త్రీలకు అన్ని రంగాల్లో సమానావకాశాలు మొదలైన అన్ని అంశాలతో ప్రభుత్వ ప్రకటనలకు, పౌరసమాజపు శుష్క వాగ్దానాలకు మాత్రమే పరిమితమౌతున్న నేపథ్యం నేడు మనకు కనిపిస్తుంది. భారతదేశానికి వెన్నుముకగా ఉన్న వ్యవసాయరంగం దళితులు లేకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.స్వాతంత్రం వచ్చిన ఈ 58సంవత్సరాలలో దళితుల అభ్యున్నతి కోసం, విద్య ఆర్థిక అభివృద్ధికోసం, దళితుల రక్షణకోసం, ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఏవీ దళితుల జీవితాల్ని మెరుగు పరచకపోవడంలేదు సరికదా మరింత దళితుల జీవితాన్ని అధః పాతాళానికి నెట్టి వేస్తున్నాయి.

సోషల్ డాక్యుమెంట్ అయిన రాజ్యాంగం అనేక అంశాలను తనలో దాచుకుంది. ఆ అంశాలు భారత ప్రజల ఆకాంక్షలని ప్రతిఫలింజేసాయి. తరాలుగా అసమానతలకు, అణచివేతలకు గురైన దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు స్త్రీలు, పిల్లలు మొదలైన వారి కోసం రాజ్యాంగం అనేక వాగ్దానాలు చేసింది. భారత ప్రజలమైన మేము ఈ దేశాన్ని సార్వభౌమాధికార, సమధర్మ లౌకిక, గణతంత్ర రాజ్యాంగం నిర్మించటానికి నిశ్చయించుకున్నాము. ఈ దేశ పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని, ఇష్టమొచ్చిన మతాన్ని అవలంబించే స్వేచ్ఛని, అవకాశాలలోనూ, హోదాలోనూ సమానత్వాన్ని, ప్రతివ్యక్తికి గౌరవాన్ని, దేశ సమగ్రతకు ఐక్యతకు దోహదపడే సౌభ్రాతృత్వాన్ని ఈ దేశ పౌరులు కలిగి ఉంటారు. అనే మాటలతో మొదలైన మన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి అర్థశతాబ్దం గడిచి ఓ అర్థ శతాబ్దం కూడా నిండుతుంది. ఇన్నాళ్ళుగా ఈ మాటలు అణగారిన దళిత ప్రజానీకానికి ఎంత ఓదార్పును. ఆశను కలిగించాయోగానీ అవి మాత్రం ఆ పుటల్లో అలా మిగిలిపోయాయి. రాజ్యాంగంలో పొందు పరిచిన అనేక అధికరణాలు దుర్మార్గమైన నిర్లక్ష్యానికి గురైనాయి. గతంలో కనీసం వేల సంఖ్యలోనైనా దళితులు విద్యావంతులై ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఉండింది. గతంలో భూపరిమితి చట్టాలు, కనీసవేతన చట్టాలు ఉపాది హామి పథకాలు ఉన్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ వుంది. ఇప్పుడు అవన్నీ గాలికి కొట్టుకుపోతున్నాయి. రిజర్వేషన్ల అమలుకు అవకాశం ఉన్న ప్రభుత్వ రంగం మూసుకుపోతుంది. సేవల రంగానికి ప్రాధాన్యం పెరిగి దళితులు అందుకోనంత దూరాన అది కేంద్రీకృతమైంది. ఇంగ్లీషుకూ, కంప్యూటర్లకూ విపరీతమైన, అనవసరమైన ప్రాధాన్యత పెరిగిపోయింది. ఆ రెండూ లేని వాళ్ళు ఉద్యోగ ప్రయత్నాలే చేయలేని పరిస్థితి నేడు నెలకొంది. విద్యా సంస్థలో దళితులకు అనుకూలమైన కోర్సులన్నీ పోతున్నాయి. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న దళితులు దినదిన గండంగా బతుకు లీడుస్తున్నారు.

ఈ రోజు పల్లెల్లో ప్రతిచోట దళిత వ్యతిరేక విధానాలే కనిపిస్తున్నాయి. వ్యవసాయాన్ని తీర్చిదిద్ది దేశానికి వెన్నెముకగా మలిచిన దళితుల చేతుల్ని ఏ నైపుణ్యతా లేని మొరటు చేతులుగా కొట్టిపడేస్తున్నారు. విపరీతమైన యాంత్రీకరణ వ్యవసాయంలోనూ, యితర గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలలోకీ చొచ్చుకు వచ్చింది. ఒక్క ప్రొక్లెయిన్ దెబ్బకి గంటకు 600మంది దళిత, ఆదివాసీ పేదకూలీలు నిరాశ్రయులవుతున్నారు. కనీసవేతనం మాట సరే కనీసపు పనిదినాలే కరువైపోయాయి. దేశానికి అన్నం పెట్టిన చేతులు నగరానికి వలస వచ్చి యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, కూకట్‌పల్లి, నల్లకుంట లాంటి నాలుగు రోడ్ల కూడల్లలో అడుక్కుంటున్నారు. అన్ని అవకాశాలనూ కోల్పోయి. వట్టి చేతులతో నిలబడ్డ దళిత సమాజంపై దాడులు, అత్యాచారాలు పెచ్చరిల్లుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగానికీ, దళితుల, యితర అణగారిన వర్గాల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం జవాబుదారీ కావాలి.

1991 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక,కేరళ రాష్ట్రాల్లోని మొత్తం దళితుల ప్రధాన పనిశక్తి ప్రాథమిక రంగంలో 81.89శాతంగా ఉంది. జాతీయ సగటు ఈ విషయంలో 77 శాతం మాత్రమే ఉంది. దళితులకు దళితేతరులకు మధ్య ఉన్న అసమానత కూడా నాలుగు రాష్ట్రాల్లో 22.23శాతంగా (జాతీయ సగటు 14.83) ఉంది. వృత్తి విషయంలో దక్షిణాది దళితుల సరిస్థితి చాలా ఘోరంగా ఉంది. ప్రతి వంద మంది దళితుల్లో 62.23 శాతం మంది భూమిలేని వ్యవసాయ కూలీలే. ఇది జాతీయ స్థాయిలో49.06శాతంగా ఉంది.

గత రెండు దశాబ్దాల్లో ఈ నాలుగు రాష్ట్రాల్లోని దళితుల ప్రధాన పనిశక్తిలో 62.66శాతం మంది (జాతీయ సగటు 45.32శాతం భూమిలేని వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. దక్షిణాదిలో మొత్తం దళిత ప్రధాన పని శక్తిలో 14.92శాతం మంది మాత్రమే ప్రధాన వ్యవసాయదారులుగా ఉన్నారు.

విద్యారంగాన్ని పరిశీలిస్తే దేశంలోని వివిధ యూనివర్సిటీల్లో రిజర్వుడు కేటగిరిల్లో 75వేల టీచింగ్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలుస్తుంది.ఢిల్లీ యూనివర్సిటీలో 1400 ఖాళీలున్నట్లు ఫోరంఆఫ్ అకడమిక్స్ ఫర్ సోషల్ జస్టిస్ తాజాగా విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. దేశంలో 256 యూనివర్సిటీలు 11వేల 115కాలేజీలున్నట్లు తెలుస్తుంది. ప్రతిసంవత్సరం 8 లక్షల మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకుంటుండగా వారికి బోధన కోసం 3 లక్షల 42 వేల మందిని నియమిస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని 79 కాలేజిల్లో 7000 అధ్యాపక పోస్టులున్నాయి. రిజర్వేషన్ల ప్రకారం ఇందులో 22.5 శాతం అనగా 1500పోస్టులు ఎస్సీ, ఎస్టీలకు చెందాలి. 1998లో వివిధ విభాగాల్లో 11మంది లెక్చరర్లు, ఇద్దరు రీడర్లు, ముగ్గురు ప్రొఫెసర్లు వివిధ కాలేజీల్లో 50 మంది లెక్చరర్ల నియామకం మాత్రమే జరిగింది. జె.ఎన్. యులో 189 ప్రొఫెసర్, 125 రీడర్, 67లెక్చరర్

పోస్టులున్నాయి. 89 రిజర్వుడు పోస్టుల్లో 3 ప్రొఫెసర్లు, 6 రీడర్లు,11 మంది లెక్చరర్లని భర్తీచేశారు,సెంట్రల్ యూనివర్సిటీల్లో హైదరాబాద్ యూనివర్సిటీలో 43 రిజర్వుడు పోస్టుల్లో 16 స్థానాలు భర్తీ చేశారు. మిగిలిన వాటిని బట్టి చూస్తే ఇది కాస్త మెరుగ్గాఉంది. పశ్చిమ బెంగాల్‌లోని విశ్వభారతి శాంతినికేతన్‌లో 97 రిజర్వుడు పోస్టులకుగాను కేవలం 19 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు.

డాక్టర్ అంబేడ్కర్ దీక్ష, పోరాటాల ఫలితంగా రాజ్యాంగంలో దళితులకు ప్రత్యేక హక్కులను కల్పించారు.సమానత్వం (చట్టం ముందే అందరూ సమానులే 14 వ అధికరణం) జీవించే హక్కు ప్రాణ రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ, పాలనా హక్కు (అధికరణం-2) అంటరానితనం నిర్మూలన (అధికరణం-17) దళితుల సామాజిక, ఆర్థిక పురోగతికోసం, విద్యా,ఉద్యోగ రిజర్వేషన్లు, రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కోసం రాజకీయ రిజర్వేషన్లు (అధిరకణం-243) రాజ్యాంగంలో కల్పించిన రక్షణలలో ముఖ్యమైనవి. 1995లో తీసుకు వచ్చిన పి.సి.ఆర్ యాక్ట్‌లో ప్రధానంగా అంటరానితనానికి సంబంధించిన నేరాలను నిరోధించే నిబంధనలు ఉన్నాయి. ఈ చట్టం అంటరానితనాన్ని నిషేదించింది. కానీ దాని రూపాలను వాటికి సంబంధించిన శిక్షలను వాటి అమలును స్పష్టంగా పేర్కొనలేదు. దాని వలన తరతరాలుగా దళితులపై పెరుగుతున్న దాడులను అత్యాచారాలను నిరోధించడానికి పునరావాస కార్యక్రమాల అమలుకు వీలు కలుగలేదు. ఎమర్జెన్సీ తరువాత జరిగిన బెల్చి, కీలవేన్మణి, కారంచేడు, చుండూరు దురంతాలు చట్టంలోని లొసుగులను బహిర్గతపరిచాయి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా సాగిన దళిత, ఇతర ప్రజాస్వామ్య ఉద్యమాల కారణంగా 1989లో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం వెలుగుచూసింది.

ఆరు దశాబ్దాల తర్వాత కూడా షెడ్యూల్డు కులాలు, తెగలపైన సాగుతున్న అత్యాచారాలు, నేరాలు సమిసిపోలేదు. దీనికి 1995లో నియమాలను రూపొందించి మరింత శక్తివంతం చేశారు. ఇది ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలను, నేరాలను విచారించడానికి ప్రత్యేక కోర్టుల సదుపాయాలను కలుగజేయడానికి బాధితులకు తగిన పరిహారాన్ని చెల్లించడానికి ఈ చట్టం కారణంగా మొట్ట మొదటిసారిగా 'అత్యాచారం'అనే పదాన్ని నిర్వచించారు. ఆత్మగౌరవంతో కూడిన స్వతంత్రమైన జీవితం గడిపే అవకాశాలను సృష్టించడం కూడా ఈ చట్టం లక్ష్యం. దానికోసం ఈ చట్టంలో కఠినమైన శిక్షలు, పునరావాసం, పరిహారం చెల్లించే ఏర్పాటు ముందుగానే గుర్తించి నిరోధించే చర్యలను రూపకల్పన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ చట్టం అమలు కోసం సాక్షి మానవ హక్కుల నిఘా, దళిత బహుజన శ్రామిక యూనియన్, దళిత బహుజన ఫ్రంట్ అదే విధంగా దేశవ్యాప్తంగా నేషనల్ కాంపెన్ ఆన్ దళిత హ్యూమన్ రైట్స్ (NCDHR) మరికొన్ని సంస్థలు పనిచేస్తున్నాయి. మన రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి కూడా పనిచేస్తుంది. వీటన్నింటి కారణంగానే జస్టిస్ పున్నయ్య కమీషన్ కూడా ఆవిర్భవించింది.

దళితులకు సామాజిక ఆర్థికరంగాలలో న్యాయం కల్పించేందుకు అనేక చట్టాలు చేయడం జరిగింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ (15-17) పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955, ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం 1989, నిబంధనలు 1995దేశవ్యాప్తంగా దళితుల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వాలను పరిరక్షించడానికి అమలులో ఉన్నాయి. అనేక అంతర్జాతీయ ఒప్పందాలపై భారతదేశం సంతకం చేసింది. అయినప్పటికీ కూడా దళితులపై అత్యాచారాలు పెరుగుతూనే ఉన్నాయి.

వెలుగులోకి రానివి ఇంకెన్నో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అనేక రకాల దళిత మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి.

దళితులపై జరుగుతున్న నేరాలకు సంబంధించి దాదాపు 24 శాతం కేసులను పోలీసులు నివేదించడంలేదు. పార్లమెంటుకు,రాష్ట్ర శాసన సభలకు పోలీసులు అందిస్తున్న సమాచారం అంతాతప్పుడు సమాచారమే అని తేలింది. పోలీసుల రికార్డులప్రకారమే సాధారణ నేరాల శాతం 90 శాతం పెరిగాయి. దళితులపైన జరిగే నేరాలలో 19శాతం స్వభావరీత్యా ప్రమాద భరితమైనది. జనాభాలో 82శాతం దళితులు, 23శాతం దళితేతరులు పైన అత్యాచారాలు జరుగుతున్నాయని అవి పెరుగుతున్నాయని నివేదికలు తేటతెల్ల చేస్తున్నాయి.

దేశంలో దళితులు, ఆదివాసీలు అనే పేరుతో పిలువబడే మనుషులు లక్షలాది మందికి స్వతంత్రం అన్న మాటే ఇంకా స్పృహలోకి రాలేదు. నిత్య దరిద్రం ఆకలి అవమానాలు నిరంతరం అత్యాచారాలతో బతుకులీడుస్తున్నారు. పనులులేక పనులుంటే సరైన వేతనాలు లేక పస్తులతో బతుకుతున్నారు. అంటరానితనం వేయి రూపాల జడల దయ్యమై హింసిస్తోంటే కులం సంకెళ్ళతో బానిస బతుకులు బతుకుతున్నారు. అభివృద్ధి అన్న మాటే ఇన్నేళ్ళుగా వాళ్ళ దరిచేరలేదు. అభివృద్ధి పేరుతో సంస్కరణల పేరుతో జరుగుతోన్న తతంగమంతా దళితులను, ఆదివాసీలను నిర్వాసితులనే చేసింది. ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న ప్రయత్నాలన్నీ దళితుల జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. సమాచార విప్లవానికి కేంద్రాస్థానమని చెప్పుకుంటున్న హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల పరిధిలోని రంగారెడ్డి, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వందలాది మంది మనుషులను మంత్రగాళ్ళనే నెపంతో సజీవంగా దహనంచేసే దుర్మార్గపు మూఢ విశ్వాసాలు తాండవమాడుతున్నాయి. ఈ అమానవీయ అత్యాచారాలకి బలౌతున్న వారంతా దళిత ఆదివాసీ ప్రజలే.

దళిత ఆదివాసీలు నిల్చున్నచోట నేలే మాయమైపోతుంది. సకల అవకాశాలూ కరిగిపోతుంటే వలస పక్షులై గాలికి కొట్టుకుపో తున్నాయి దళిత జీవితాలు. ఈ నేపథ్యంలో ప్రపంచబ్యాంకు ఆంక్షలు దళిత జీవితాలపైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఉమ్మడిగా స్థిరీకరణ, వ్యవస్థాగత సర్దుబాటు అనే పథకాన్ని రచించి బడుగుదేశాల ముందుంచాయి. స్థిరీకరణ కోసం కరెన్సీ విలువను మారక విలువకు అనుగుణంగా తగ్గించడం, దిగుమతులపైన ఆంక్షల్ని తొలగించడం చెల్లింపులు లోటుకు మధ్యనున్న వ్యత్యాసాన్ని తొలగించడం ధరల మారక వడ్డీరేట్లపైన అదుపును తొలగించటం, అన్ని రకాల సబ్సిడీలను తొలగించటం ఆర్థిక సంస్థల నిర్మాణాన్ని సంస్కరించి విదేశీ సంస్థలకు స్వేచ్ఛా ప్రవేశాన్ని కల్పించటం స్వతంత్ర ద్రవ్యనిధి విధానాన్ని అవలంబించడానికి కేద్ర బ్యాంకుకు పూర్తి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడం వంటి నిర్దేశిక సూత్రాలను అవి రూపొందించాయి.

అదుపులేని పోటి, సమతుల్యత లేని అభివృద్ధి వలన యిప్పటికే సామాజిక అసమానతలు తీవ్రతరమయ్యాయి. దేశంలో అత్యధిక జనాభా అయిన దళిత ఆదివాసీ ప్రజలు ఆహార భద్రతలేక ఉపాధి అవకాశాలను కోల్పోయి. దిక్కులేని వారవుతున్నారు. సామాజికంగా వివక్షకు గురవుతున్న కులాలకు చెందిన వారుగా దళితులు అంటరాని తనాన్ని, ఆకలినీ, హింసను, వివక్షనీ వేల యేళ్ళుగా ఎదుర్కొంటూనే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగం దళితుల కోసం ఎన్నో అవకాశాలను రక్షణలను కల్పించింది. దాని అమలులో ఎన్నో అవకతవకలు, నిర్లక్ష్యం ఉన్నప్పటికీ ఎంతో కొంత మేలు కూడా జరిగింది.

భవిష్యత్‌లో దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల ప్రజలు మానవ హక్కులను అనుభవించడానికి, పరిరక్షించడానికి అంతిమంగా సమన్వయంతో కూడిన సమాజాన్ని సాధించుకోవడానికి మరింత శక్తితో, అవగాహనతో ఉద్యమాలు నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. దళిత హక్కుల ఉద్యమ పోరాటానికి స్ఫూర్తి బౌద్ధమతంలో ఉంది. మనుషులంతా సమానమేనని అందరికీ సమాన హక్కులు, బాధ్యతలు ఉండాలనిపేర్కొన్న తొలి తత్వవేత్త గౌతమ బుద్ధుడు. గౌతమ బుద్ధునిఆలో చనలకు అనాటి సాంఘిక పరిస్థితులే ప్రధాన ప్రేరణగా నిలిచాయి. "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అన్న నినాదం నుండి నేటి"దళిత హక్కులే మానవ హక్కులు" అనే నినాదం వరకు పిడికిళ్ళు బిగించిన దళిత ఆదివాసీ సమూహాలను మనం చూస్తున్నాం. అణగారిన ఈ మనుషుల ఐక్యతా నినాదాన్ని మనం ఆవాహనం చేసుకోవాలి. కానీ ఇక్కడ కులం గీతలు గీస్తుంది. దోపిడి కులాలకీ- దోపిడీకి గురయ్యే కులాల మధ్యన కూడా విభజన రేఖని గీస్తుంది. కులవ్యవస్థ శ్రమ విభజన కాదు, శ్రామికుల విభజన కూడా అన్న అంబేడ్కర్ మాటలు మన జ్ఞప్తికి ఉంచుకోవాలి. ఉమ్మడి సమస్యలపైన ఐక్యపోరాటం సాగించి హక్కుల్ని సాధించుకోగలగాలి. విభేదాలను గుర్తిస్తూ ఐక్యంగా ఉండాడానికి ఐక్య నినాదాలివ్వడానికి అస్థిత్వ ఉద్యమాలు, వివిధ సంఘాలు అలవాటు పడాలి. ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న పరిణామాలు, రాజకీయాల కాషాయీకరణ, ప్రభుత్వాల దళిత వ్యతిరేక విధానాలు, వీటన్నింటినీ దృష్టిలో వుంచుకొని దళిత కులాలు ఐక్యపోరాటాల ద్వారా ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులు సాధించుకోవాలి. అందుకోసం అధ్యయనం, ఆలోచన ఆచరణ అంబేడ్కరిజపు వెలుగులో కొనసాగాలని ఆకాంక్షిద్దాం. ●

---

(➜ 8వ పేజీ తరువాయి ..... )

సమాధిచేశాడు. అగ్రకులాలు మనువుకు ప్రాణం పోస్తూనే ఉన్నారు. ఇది ప్రస్తుతమున్న నిత్యసంఘర్షణ. స్వాతంత్ర్యానంతర భారతదేశం దళితులకు విద్యనిచ్చింది. ఈ దేశ కులసమాజం పాఠశాలల్లోనూ విశ్వవిద్యాలయాల్లోనూ, కళాశాలల్లోనూ, చదువుకునే దళితులపై కులవివక్ష అనే ముళ్ళ కిరీటాన్ని పెట్టి చదువుకు దూరంగా నెడుతుంది. స్వాతంత్ర్యానంతర భారతదేశం దళితులకు ఉద్యోగాలు ఇచ్చింది. ఈ దేశకులసమాజం అన్ని కార్యాలయాల్లోను తన వికృత అణచివేతను కొనసాగిస్తూనే ఉంది. స్వాతంత్ర్యానంతర, భారతదేశం దళితులకు చట్టసభల్లో ప్రవేశాన్ని కల్పించింది. అగ్రకుల సమాజం దళిత సమూహం పట్ల బాధ్యత ఉన్నవారిని చట్టసభల్లోకి వచ్చేందుకూ ప్రాధాన్యతనివ్వడం లేదు, తమకు ఊడిగం చేసే వారికే సీట్లిస్తుంది.

భారతరాజ్యాంగం తన ప్రజలకు సగౌరవంగా తలెత్తుకొని బ్రతికే హక్కునిచ్చింది. కులసమాజం దళితులు తలెత్తిన ప్రతిచోట తలలను నరికివేస్తుంది. రాజ్యాంగం దళితులకు చదువుకునే హక్కు నిచ్చింది. అగ్రకుల సమాజం, పాలకులు విద్యను ప్రైవేటుపరంచేశారు. భారతరాజ్యాంగం దళితులకు ఆరోగ్యపు హక్కునిచ్చింది. పాలకులు ఆసుపత్రులను ప్రైవేటు పరంచేశారు. భారతరాజ్యాంగం దళితులకు పని హక్కును కల్పించింది. పాలకులు పరిశ్రమలనూ ప్రైవేటుపరం చేశారు. ఇది 60 యేళ్ళ స్వా(హా)తంత్ర భారతం.

1947 స్వాతంత్ర్యపోరాటం కాలంలో అంబేడ్కర్ అనే ఒక్క వ్యక్తిత్వం మాత్రమే సూటిగా నిలబడింది. అంబేడ్కర్ పాత్రలేని ప్రస్తుతప్రజాస్వామ్య వ్యవస్థనూ ఊహించలేము. రాజ్యాంగంలోని అధికారణ 17 అంటరానితనాన్ని నిషేధించింది. అంటరానితనం శిక్షార్హమైన నేరంగా ప్రకటించింది. అలాగే దళితులకు రిజర్వేషన్లు కల్పించింది. ఇంకా దళితుల రక్షణ కోసం ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధకచట్టాన్ని తీసుకువచ్చారు. ప్రస్తుతం అంబేడ్కర్ మహాశయుడి వల్ల దళితులకు రాజ్యాంగ రక్షణలు, చట్టం నుండి రక్షణలు అందివ్వడం జరిగింది. అయితే ఈ రాజ్యాంగ రక్షణలను కొద్దిస్థాయిలో అందుకుంటూ కొద్దిమాత్రం అభివృద్ధి సాధించినా అది అగ్రకులాలకు కంటగింపు అవుతుంది. తమముందు చెప్పులు విడిచి నిలబడే దళితుడి కుమారుడే తెల్లచొక్కా వేసుకు తిరిగినందుకే దాడిచేసే వ్యవస్థ ఇక్కడ వుంది. దేశవ్యాప్తంగా దళితులపై జరిగిన హత్యాకాండలన్నీ కేవలం దళితులు ఆత్మగౌరవాన్ని ప్రకటించి నందుకేననేది ఏ సంఘటనను గమనించి నా అర్థమైపోతుంది. దళితులు ఆత్మగౌరవాన్ని ప్రదర్శిస్తేనే భరించలేని కులవాదులు రేపు దళితులు ఈ దేశాన్ని ఏలే పరిస్థితిని జీర్ణించుకోవాల్సి ఉంటుంది.

ఈ దేశ దళిత సమూహం రాజ్యాంగ రక్షణలు, చట్టాల సాయంతో ఇపుడిపుడే తన ఉనికిని ప్రకటిస్తుంది. దీన్ని జీర్ణించుకోలేని కులసమాజం ఈ ప్రయత్నాలను అంతర్గతంగానూ, బహిర్గతంగానూ ప్రతిఘటిస్తునే ఉంది. తమకు అనుకూలంగా ఉన్న రాజ్యాంగాన్ని, చట్టాలనూ అమలుచేయించుకోలేని పరిస్థితిలో అన్యాయాలను, అక్రమాలను, అవినీతిని భరిస్తూ అత్యాచారాలకూ, హత్యలకు, నిత్యం గురి అవుతున్న దళితులకు స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పగలమా?

స్వాతంత్ర్యం వచ్చేటపుడు గానీ, వచ్చినతర్వాత గానీ దళిత సమూహంలో దాని ప్రాసంగికత ఏమిలేదు. ఇపుడు 1947 ఆగష్టు 15న జరిగిన అధికార మార్పిడినే స్వాతంత్ర్యంగా భావించిన వాళ్ళందరూ దళితుల స్వాతంత్ర్యం కోసం ఉద్యమించవల్సిన అవసరం ఉంది. ఇపుడు ఆగష్టు 15న జరిగే జెండా పండగని దళితులు ఎలా జరుపుకోవాలనేది ఒక్క ప్రశ్నే. ●

# వాకపల్లి గిరిజన మహిళలపై జరిగిన అత్యాచార ఘటనకి సంబంధించిన నిజనిర్ధారణ నివేదిక

| | | |
|---|---|---|
| అత్యాచారం జరిగిన తేది | : | 20-08-2007 |
| అత్యాచారం | : | కూంబింగ్ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ పోలీసులు జరిపిన సామూహిక మానభంగం |
| గ్రామం | : | వాకపల్లి |
| పంచాయితీ | : | సుర్మతి |
| మండలం | : | జి. మాడుగుల |
| డివిజన్ | : | పాడేరు |
| జిల్లా | : | విశాఖపట్టణం |
| జిల్లా కలెక్టర్ | : | అనిల్ సంఘాల్, ఐ.ఎ.యస్ |
| ఎస్పీ | : | అంకున్ సబర్వాల్, ఐపియస్ |
| డియస్పీ | : | స్టాలిన్ |

**బాధితులు వివరాలు**

| క్ర. సం | బాధితురాలి పేరు | భర్త పేరు | వయసు | పిల్లలు | మిగిలిన సమాచారం |
|---|---|---|---|---|---|
| 1. | పాంగి భార్సో | కొండబాబు | 35 | సింగమ్మ(15) మత్స్యరాజు(12) కొంబలేమ్మ(8) మరియమ్మ(6) 2వ తరగతి | పసుపు పొలంలో కలుపు తీస్తుండగా మానభంగానికి గురయింది. |
| 2. | పాంగి సీతాయి | నాగేంద్ర | 30 | బుజ్జిబాబు (6) 2వ తరగతి | పసుపు పొలంలో నీటిగుంట దగ్గర మానభంగానికి గురయింది. |
| 3. | కుంటాలసీతమ్మ | బాలయ్య | 40 | హిందుబాబు సిరియ భీమబాయి(12) | పొలానికి వెళ్తూ మానభంగానికి గురయింది. |
| 4. | కుర్రా హర్షమ్మ | క్రిష్ణారావు | 30 | యోసేపు(8) మార్త (5) | ఇంట్లో మానభంగానికి గురయింది. |
| 5. | పాంగి అందె | రమేష్ | 25 | నూకరాజు(7) సీత (2) | అన్నం వండుతూ మానభంగానికి గురయింది. |
| 6. | కుర్రా కుమారి | క్రిష్ణారావు | 20 | పిల్లల లేరు | నీళ్ళకి వెలుతుంటే మానభంగానికి గురయింది. |
| 7. | కుర్రాజానకమ్మ | మత్స్యంగ రావు | 25 | ఈశ్వరరావు | ఇంట్లో మానభం గానికి గురయింది. |
| 8. | పాంగి శ్రీదేవి | సూర్యం | 19 | 4రోజుల ముందు బిడ్డ చనిపోయాడు | ఇంట్లో మానభం గానికి గురయింది. |
| 9. | పాంగి లక్ష్మి | దాసుబాబు | 30 | ఒక బిడ్డ (5) | పొలంలో పని చేస్తుండగా అత్యాచారానికి గురయింది. |
| 10. | వంతల రేంధొ | అప్పారావు | 25 | సునీత(5) భారతి (2) | ఇంట్లో అత్యాచారానికి గురయింది. |
| 11. | కుర్రా చిలకమ్మ | నరసింహ | 45 | శ్రీదేవి (19) (సూర్యం భార్య) రామన్ నక్కారాజు సునీత | పసుపు పొలంలో మానభం గానికి గురయింది. |

నిందితులు : కూంబింగ్ నిర్వహిస్తున్న 21 మంది పోలీసులు మానభంగానికి పాల్పడ్డారని బాధితులు పేర్కొన్నారు.

**కేసుకు సంబంధించిన వాస్తవాలు :**

విశాఖపట్నం జిల్లా పాడేరు డివిజన్ జి. మాడుగుల మండలం సుర్మతి గ్రామపంచాయితీలోని చిన్నపల్లె వాకపల్లి. ఇది భారత రాజ్యాంగంలో సూచించబడిన షెడ్యూల్డ్ ప్రాంతం. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 3600 అడుగుల ఎత్తులో ఉంది. ఈ గ్రామం చుట్టూ పచ్చటి కొండలు వరి, పసుపు పొలాలు, అరటి తోటలు ఉన్నాయి. ఈ ప్రాంతమంతా చల్లని ప్రశాంతమైన ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. అక్కడి ప్రజలు పొలాలు సాగుచేసుకుంటూ, గొర్రెలు, ఆవులు, కోళ్ళు పెంచుకొంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఈప్రజలు 'కొంద్' అనే షెడ్యూల్డ్ తెగలకి చెందినవారు. ఆదిమ తెగలకి చెందినవారు. వారికి స్వంత గిరిజన ఆచార సాంప్రదాయాలు ఉన్నాయి. ఆ గ్రామంలో 59 కుటుంబాలు ఉన్నాయి. ఒక ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. అంగన్‌వాడి కేంద్రం ఉంది. ఆ గ్రామంలో ఇంటర్ మీడియట్ పాసైన బాలుడు ఒకరు. పదవతరగతి పాసైన 3 బాలురు ఉన్నారు. కొంతమంది పిల్లలు ప్రభుత్వ వసతి గృహంలో ఉండి చదువుకొంటున్నారు. ఈ ప్రజలందరూ చాలాకాలం క్రితం ఒరిస్సా నుండివలసవచ్చారని చెప్పారు. వాళ్ళు ఒరియా భాషలో కలిసి గిరిజన భాషను మాట్లాడుతున్నారు. ఆ భాషకి లిపిలేదు.

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం 20.8.07న ఉదయం 6గం॥లకి 21 మందితో కూడిన పోలీసుల బృందం గ్రామాన్ని

చుట్టుముట్టింది. గ్రామంలో మగవాళ్ళు ఎవరూ లేరు. సాధారణంగా మగవాళ్ళు ఉదయం నాలుగు గంటలకే పొలాలకు వెళ్ళిపోతుంటారు. మహిళలు ఇంటిపనులు అన్నం వండటం నీళ్ళు పట్టుకోవడం, బట్టలు ఉతక్కోవడం లాంటి పనులు చేస్తుంటారు. పోలీసులు ఇళ్ళలోకి వచ్చి మహిళల్ని మానభంగాలకి గురిచేశారు. కొంతమంది పోలీసులు పొలాల్లో పనిచేస్తున్న మహిళలపై మానభంగాలకు గురిచేశారు.

వీరిలో ఒక మహిళపై ముగ్గురు పోలీసులు అత్యాచారం చేశారు. ఒక మహిళ భర్తని పోలీసులు పట్టుకెళ్ళారు. అతన్ని కూడా అప్పగించ లేదు. అతని గురించిన సమాచారం లేదు. ఆమెపై అత్యాచారం జరిగే రోజుకి 4 రోజుల ఆమె బిడ్డ చనిపోయాడు.

**ఎమ్మెల్యే లకేరాజారావు వాంగ్మూలము :** ఎమ్మెల్యే తెలిపిన ప్రకారం ఈ ప్రజలు నిజాయితీతో ఐక్యంగా ఉంటారు. వాళ్ళ అబద్ధాలు చెప్పరు. వాళ్ళు ఆచారాలు, సాంప్రదాయాలు చాలా ఖచ్చితంగా ఉంటాయి. ఆ సంఘటన జరిగిన తర్వాత ఆయన బాధితుల్ని తీసుకొని సబ్ డివిజన్ మేజిస్ట్రేట్, పాడేరు ప్రాజెక్టు అధికారిని కలిసారు. బాధితుల్ని విశాఖపట్నం తీసుకెళ్ళాలని కలెక్టరు ఇచ్చిన ఆదేశాల ప్రకారం వారు విశాఖపట్టణంలోని కింగ్‌జార్జి ఆసుపత్రికి పంపబడ్డారు. బాధితులకి ఒక్కొక్కరికి 10 లక్షల రూపాయాలు నష్టపరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేయటం జరిగింది.

**కొర్రా రత్తి (65) వాంగ్మూలము (భర్త పేరు దామరయ్య) :** నా పేరు రత్తి 20.8.07 ఉదయం పోలీసులు మా ఇంటిలోకి వచ్చారు. నా మరదలు లింగాతుమ్మ భయపడి అడవిలోకి పారిపోయింది. పోలీసులు ఆమెను వెతుకుతున్నప్పుడు నిద్రిస్తున్న పాపపై కత్తిపడేదే! నేను వెంటనే పాపను పక్కకి లాగాను. తర్వాత పోలీసులు మానభంగాలకి ఒడిగట్టారు. ఇదేం అన్యాయమన్న వాళ్ళపై తుపాకులు ఎక్కుపెట్టి చంపుతామన్నారు.

**కొర్రా దామరయ్య వాంగ్మూలము :** నా పేరు కొర్రా దామరయ్య. నావయసు 70 సం။రాలు నేను గ్రామానికి పెద్దను. 20.8.07న ఉదయం 9గం॥లకి పొలం నుంచి వచ్చాను. 11 మంది మా గ్రామ మహిళలు పోలీసుల చేతిలో మానభంగానికి గురయ్యారని తెలిసింది. తర్వాత గ్రామసర్పంచ్‌ని ఎమ్మెల్యే లకేరాజారావుని కలిసాను. తర్వాత మేము సబ్‌డివిజన్ మేజిస్ట్రేట్ ప్రాజెక్టుఆఫీసర్‌ని కలిసాము. బాధితులు విశాఖపట్నంలోని కింగ్‌జార్జి ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. బాధితులు తమ ఇళ్ళకి, పిల్లలకి దూరంగా ఉంచబడ్డారు. మా ఆచారం ప్రకారం వారికి శుద్ధ కార్యక్రమం జరిపే వరకు వాళ్ళ బైటే ఉంటారు. నేను గ్రామపెద్దగా వారికి ఆశ్రయమిచ్చి అన్నం పెడుతున్నాను. నా ఇంటి వరండాలో వాళ్ళ పడుకొంటున్నారు. మా గ్రామాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ లాంటి అధికారులు ఇంతవరకు సందర్శించలేదు. ఇంతకు ముందెన్నడూ మేము ఇంతటి భయంకరమైన అనుభవాన్ని చవిచూడలేదు.

**అధికారుల స్పందన :** 20.8.07న ప్రసారమాధ్యమాల్లో వచ్చిన వార్తని చూసి ఆంధ్రప్రదేశ్ డిజిపి బాసిత్, ఐపియస్, కూంబింగ్ పోలీసులు గిరిజన మహిళలపై ఎలాంటి అత్యాచారం జరపలేదని తెలియజేశాడు.

విశాఖపట్టణం జిల్లా ఎస్పీ, కూంబింగ్ పోలీసులు ఎలాంటి అత్యాచారం చేయలేద తెలిపాడు. ఆయన గ్రామాన్ని సందర్శించలేదు. జిల్లా కలెక్టర్ కూడా గ్రామాన్ని సందర్శించలేదు.

**నిజనిర్ధారణ బృంద నిర్ధారణలు :**

1. బాధితులపై జరిగిన అత్యాచారం నిజం
2. బాధితులని చూసిన తర్వాత వారిపై పోలీసులు మానభంగం చేసారనే మాట నిజమని తెలుస్తుంది.
3. 11 మంది బాధితులపై మానభంగం జరపబడింది.
4. మానభంగం ఉదయం 6గంటల నుండి 7గంటల మధ్య జరిగింది.

**సిఫార్సులు :**

1. ప్రభుత్వం నిందితుల జాబితాలని బైటపెట్టాలి.
2. హైకోర్టు సిటింగ్ జడ్జి ఆధ్వర్యంలో న్యాయవిచారణ జరిపించాలి.
3. అత్యాచారానికి సరైన బాధితులకి తక్షణమే సహాయ పునరావాస చర్యలు చేపట్టాలి.
4. బాధితుల కుటుంబ సభ్యులకి రక్షణ కల్పించాలి.
5. నిందితుల్ని వెంటనే అరెస్టుచేయాలి.
6. ప్రతి బాధితురాలికి 10 లక్షల నష్టపరిహారం అందించాలి.

**ప్రజా ప్రయోజన వ్యాజ్యం :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో రిట్ పిటిషన్ నెం. 18142/07 దాఖలు చేయబడింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిన్హా, న్యాయమూర్తి నాగార్జున రెడ్డిలతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ కేసు వచ్చింది. ఫోరెన్సిక్ నివేదికని అందజేయమని, బాధితుల కుటుంబ సభ్యులని ఎవరినీ అరెస్టు చేయరాదని కేసును విచారించిన న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశించింది. 29.8.07న ఫోరెన్సిక్ నివేదిక కోర్టుకి అందజేయబడింది. ఈ రిట్ కోర్టులో పెండింగ్‌లో ఉంది.

వాకపల్లి ఆదివాసి బాధితుల పోరాట సంఘీభావ కమిటీ పేరుతో 43 సంఘాలు న్యాయం కోసం పోరాటం చేస్తున్నాయి. 30.8.07న హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ప్రెస్‌మీట్ జరిగింది. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడింది.

**నిజనిర్ధారణ బృందం :**

1. **యస్. దేవకుమార్,** సిటీ కో.ఆర్డినేటర్, సాక్షి-ఇఐడిహెచ్ఆర్ ప్రోగ్రాం
2. **జి. సుధాకర్,** డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధానకార్యదర్శి
3. **కుసుమ,** విశాఖపట్టణం జిల్లా, మానవహక్కుల పరిరక్షకురాలు
4. **యమ్. శోభ,** విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు
5. **మన్ను,** విజయనగరం జిల్లా మానవహక్కుల పరిరక్షకురాలు
6. **గొంట శ్రీ లక్ష్మి,** డిబిఎస్‌యు కాకినాడ మండలకార్యదర్శి
7. **చిలక,** గిరిజన కొండ మహిళా అనువాదకులు, అనకాపల్లి
8. **పి. శేషారత్నం,** మహిళా హక్కుల కో.ఆర్డినేటర్, పాదు

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు - డిసెంబర్ 2006 - ఆగస్టు 2007

## డిసెంబర్ 2006

**మెదక్ :** 28.12.06న మెదక్ జిల్లా దౌలతాబాద్ మండలం ఇంచుపల్లి గ్రామానికి చెందిన సత్తవ్వ (32) పై అదే గ్రామానికి చెందిన తీగల అశోక్‌గౌడ్ అత్యాచారం చేయడం జరిగింది.

**పశ్చిమగోదావరి :** 06.12.07న పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంకి చెందిన పినాగదుర్గ (14) అనే దళిత స్త్రీ పై కాలిశెట్టి శ్రీను అనే కాపు కులానికి చెందిన దళితేతర వ్యక్తి అత్యాచారం చేయడం జరిగింది.

## జనవరి 2007

**మెదక్ :** 01.01.07న మెదక్ జిల్లా మిర్‌దొడ్డి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బైండ్ల రఘుపతి అనే దళితునిపై జనవరి 1వ తేదీన అదే గ్రామానికి చెందిన జి. బ్రహ్మారెడ్డి, యన్. లక్ష్మన్ రెడ్డి, యన్. బాలరెడ్డి అనే దళితేతర వ్యక్తులు హత్యాయత్నం చేసారు.

## ఫిబ్రవరి 2007

**తూర్పుగోదావరి :** 07.02.07న తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలం గోగివారిపేట గ్రామానికి చెందిన పల్లె సుబ్రమణ్యం (28) అనే వ్యక్తిని దళితేతర సత్తి సూర్య నారాయణ మూర్తి, వి.రామకృష్ణ, వి. వెంకటరావు అతని కొడుకులు ఫిబ్రవరి 7వ తేదీన హత్యచేసి రావులపాలెం ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర పారవేయడం జరిగింది.

**ఖమ్మం :** 05.02.07న ఖమ్మం జిల్లా చర్లమండలం గోముగూడెం గ్రామానికి చెందిన దళితులపై అదే గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి, ఆవుల మదన్ మోహన్ రెడ్డి, బి. సురేంద్ర, పెద్దారెడ్డి, నారా రాజేష్, శాంతిపురి సత్యం. సంకపాక ప్రభాకర్, మురళి, ఒప్పాల గణపతి, ఆవుల నారాయణరావు అనే దళితేతర వ్యక్తులు దాడిచేసారు. ఆ దాడిలో కోడి రెక్కల వెంకటరావు, కోడిరెక్కల పున్నం భాస్కర్ రావు, సమ్మక్క, గాంధీలు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.

## మార్చి 2007

**తూర్పుగోదావరి :** 14.03.07న సీతానగరం మండలం యునికుడ్లె గ్రామానికి చెందిన పోచమ్మ (17) అనే దళిత బాలిక మార్చి 14వ తేదీన స్థానిక భూస్వామి వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకుంది.

**మహబూబ్‌నగర్ :** 30.03.07న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, చెన్నయ్య, ఇందిర అనే దళితులపై అదే గ్రామానికి చెందిన దళితేతర వ్యక్తులు బాణామతి చేస్తున్నారన్న నెపంతో దాడి చేయడం జరిగింది.

## ఏప్రిల్ 2007

**కర్నూలు :** 14.04.07న కర్నూలు జిల్లా బనగాంపల్లి మండలం పాతపాడు గ్రామానికి చెందిన అరుణ (20) అనే మహిళ అత్యాచారానికి గురై హత్యచేయబడింది.

**కడప :** 15.04.07న చెన్నూరు మండలం రామన్నపల్లె గ్రామానికి చెందిన బాలికపై ఎ. బాలవెంకటరెడ్డి అనే వ్యక్తి అత్యాచారం చేసాడు.

**హైదరాబాద్ :** 26.04.07న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన వి. స్వప్న (16) అనే బాలికని అదే ప్రాంతానికి చెందిన వేణుగోపాల్ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు గురిచేసాడు. అది భరించలేని ఆ బాలిక ఆత్మహత్య చేసుకుంది.

**చిత్తూరు :** 29.04.07న చిత్తూరు జిల్లా గుండ్లాపల్లికి చెందిన దళితులు తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన దళిత గోవిందం కార్యక్రమంలో పాల్గొననందుకు ఆ గ్రామ దళితేతర వ్యక్తులు ఏప్రిల్ 29వ తేదీన దళితుల్ని సాంఘిక బహిష్కరణకి గురిచేసారు.

**అనంతపూర్ :** 30.04.07న అనంతపూర్ జిల్లా కదిరి గ్రామానికి చెందిన దళితులపై ఏప్రిల్ 30వ తేదీన దళితేతర వ్యక్తులు దాడి చేసి దళితుల ఆస్తికి నష్టం కలుగజేశారు.

## జూన్ 2007

**కడప :** 04.06.07న కడప జిల్లా రాజంపేట మండలం పోలీసీతారాంపురం గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాస్ అనే దళితునిపై పోలిపాపిరెడ్డి, పోలినరసారెడ్డి, పోలి వెంకటరెడ్డి అనే దళితేతర వ్యక్తులు దాడి చేసి కొట్టడం జరిగింది.

**చిత్తూరు :** చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం చారల దళితవాడకి చెందిన దళిత బాలికపై (14) అదే గ్రామానికి చెందిన ఈశ్వరయ్య అనే వ్యక్తి 24.6.2007న అత్యాచారం చేయగా అది భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది.

## జులై 2007

**కడప :** 03.07.2007న కడప జిల్లా సిద్ధావతం మండలం వంతేటిపల్లికి చెందిన వెంకటపతి అనే దళితున్ని సిద్ధావతం సబ్‌ఇన్స్‌పెక్టర్ శంకరయ్య అవమానించిన కారణంగా అతను జులై 3వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు.

## ఆగష్టు 2007

**రంగారెడ్డి :** 09.08.07న రంగారెడ్డి జిల్లా శివంపేట మండలంలోని గిరిజన తాండాలోని గిరిజన మహిళని లక్ష్మణ్. హర్‌సింగ్, లష్కర్, పూనే మరియు శ్రీను అనే వ్యక్తులు సామూహిక మానభంగం చేసారు.

**కరీంనగర్ :** 09.08.07న కరీంనగర్ జిల్లా సారంగపూర్ మండలం కోల్వాయి గ్రామానికి చెందిన దళితులు సర్వే నెంబర్ 4-171లోని ప్రభుత్వం ఇచ్చిన 60 ఎకరాల పొలాన్ని సాగుచేసుకుంటున్నారు. వారిపై తుపాకుల శంకర్ (సర్పంచ్ భర్త) నవీన్‌రావు, జక్కల చంద్రయ్య మిగిలిన 50 మంది దాడిచేసి పొలాన్ని పంటని విధ్వంసం చేశారు. పోలీసు రెవిన్యూ అధికారులకి విజ్ఞప్తి చేసినా స్పందన లేదు.

**హైదరాబాదు :** 17.08.07న హైదరాబాదు జిల్లాలోని పంజాగుట్టకి చెందిన దళితులు అనసూయ, ఆమె కొడుకు మహేష్‌పై దళితేతరుడైన రామిరెడ్డి అనే వ్యక్తి భూమి విషయంలో కులదూషణ చేసి దాడి చేయడం జరిగింది.

**కృష్ణ :** 23.08.07న కృష్ణాజిల్లా గుడివాడ మండలానికి చెందిన కొడాలి మేరి అనే యువతి అనుమానాస్పద స్థితిలో మరణించింది.

**ఖమ్మం :** 26.08.07న ఖమ్మం జిలా తల్లంపాడు గ్రామానికి చెందిన దళితులపై భూ పోరాటం సందర్భంలో దళితేతర సిపియం కార్యకర్తలు దాడి చేశారు.

**నిజామాబాదు :** 28.08.07న నిజామాబాదు జిల్లా రంజిల్ మండలం సతాపూర్ గ్రామానికి చెందిన సబిత్‌వాలి గిరిజన మహిళకి రాధామోహన్ అనే డాక్టర్ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయగా ఒకరోజు తర్వాత ఆమె మరణించింది.

**మెదక్ :** 28.08.07న మెదక్ జిల్లా సంగారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దళితుల్ని వి.నవీన్, బి.దుర్గయ్య బాలముకుందరెడ్డి, ఆంజనేయులు, నరసమ్మ, పోచమ్మ, బి.క్రిష్ణ అనే వ్యక్తులు సాంఘిక బహిష్కరణకి గురిచేశారు.

**రంగారెడ్డి :** 29.08.07న రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంకి చెందిన దళిత బాలికని చిటికల శేఖర్ అనే ఆటోడ్రైవర్ మానభంగం చేశాడు.